Follow: @ANNTELUGU

04-06-2025

ANN తెలుగు

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 182 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ట్రంప్ ఫోన్‌తో మోదీ సరెండర్

### ట్రంప్ ఆదేశించగానే మోదీ భయపడ్డారు

ఆయన ఆదేశాలు తూచా తప్పకుండా ఫాలో అయ్యిండు

సరెండర్ కావడం బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలకు అలవాటే


గతంలో ఇందిరా గాంధీ ఎవరికీ భయపడలే

ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఫైర్

వివరాలు 2లో

టాప్ న్యూస్


## ఎట్టి పరిస్థితుల్లో ఒప్పకోం



- బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం
- ఆపేందుకు ఏం చేయాలో అన్నీ చేస్తాం
- మరో రెండ్రోజుల్లో పూర్తి వివరాలను ప్రకటిస్తాం
- ప్రజల సహకారంతో అవసరమైతే ఉద్యమానికి సిద్ధమే?
- బనకచర్ల ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన కామెంట్స్

02

## వారం రోజులు టైం ఇస్తున్నా..



- మిస్ వరల్డ్ పోటీలకు 200 కోట్లు ఎక్కడయ్యాయి?
- కేటీఆర్, హరీశ్ రావులు రావాలె.. దీనిపై చర్చిద్దాం
- తెలంగాణ భవన్‌కు రావాలా? అబిడ్స్ చౌరస్తాకు రావాలా?
- బీఆర్ఎస్ నేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఛాలెంజ్

02

## మంత్రి పొంగులేటి చరిత్రలో నిలిచిపోతారు



- ధరణిని బంగాళాఖాతంలో వేశారు
- భూ భారతి తెచ్చారు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశంసలు

02



## మిస్ వరల్డ్ పోటీల ఖర్చు రూ.30 కోట్లే

- రూ. 21 కోట్లు స్పాన్సర్ల ద్వారా వచ్చాయి
- రూ. 200 కోట్లు ఖర్చు చేశారన్నది తప్పుడు ప్రచారం
- 200 కోట్లు ఎక్కడ ఖర్చు అయ్యాయో బీఆర్ఎస్ నేతలు చెప్పాలి
- దీనిపై చర్చకు సిద్ధమా? అని సవాల్
- నిరూపించకపోతే ముక్కు నేలకు రాయాలి
- మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ ఆరోపణల్లో వాస్తవం లేదు
- దీనిపై ప్రతిపక్షాల అభూతన కల్పనలు, అవాస్తవాలను ప్రచారం చేశాయి
- మంత్రి జూపల్లి కృష్ణారావు

వివరాలు 2లో



## చిలకలూరిపేటలోని సాయికార్తీక్ సిటీ సెంటర్ అన్యాయంగా ఆక్రమించారు

- మా ఆస్తులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు అనుచరులు కబ్జా చేశారు
- చంపేస్తామంటూ బెదిరిస్తున్నారు
- మమ్మల్ని కాపాడండి, న్యాయం చేయండి
- తల్లి తండ్రితో కలిసి ప్రెస్ మీట్ లో గోడు వెళ్లబోసుకున్న బాధితుడు ఎన్నారై రావి మురళి మోహన్
- ఆంధ్రప్రదేశ్ లో కేసు పట్టించుకోవడం లేదు
- మీడియాలో రాకుండా కుట్ర చేస్తున్నారు
- హైదరాబాద్ మీడియా ముందు ఎన్నారై కుటుంబం ఆవేదన

వివరాలు 3లో



## సోషల్ మీడియాలో లేకపోయినా నో వీసా

- యూఎస్ నిబంధనలతో జనాల్లో టెన్షన్
- పాకుల మీద పాకులిస్తున్న ట్రంప్

వివరాలు 4లో







# జయహో బెంగళూరు

### 18 ఏళ్ళ నిరీక్షణకు తెర

- ఐపీఎల్ 2025 ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్
- ఈ సాలా కప్ నమ్దే ..
- విరాట్ కోహ్లీ చిరకాల స్వప్నం సాకారం
- అహ్మదాబాద్‌లో బెంగళూరు అభిమానుల సంబరాలు

(మహా స్పోర్ట్స్ బ్యూరో)

ఐపీఎల్ చరిత్రలో తొలిసారిగా రాయల్ ఛాలెజర్స్ బెంగళూరు కప్పు కొట్టింది. 18 ఏళ్లుగా కలగా ఉన్న టైటిల్‌ను సొంతం చేసుకుంది. 18 ఏళ్లుగా కొనసాగుతున్న నిరీక్షణకు తెరదించింది. గత మూడు పర్యాయాలు ఐపీఎల్ టైటిల్‌ను తృటిలో చేజార్చుకున్న ఆర్సీబీ.. ఈసారి మాత్రం పట్టువదల్లేదు. సమష్టి ప్రదర్శనతో తొలిసారి ఐపీఎల్ టైటిల్‌ను ముద్దాడింది. పోటాపోటీ మ్యాచ్ లో చివరి ఓవర్ వరకు ఉత్కంఠ కొనసాగినా.. ఆర్సీబీకి కప్పు లేదనే విమర్శకులకు చెక్ పెట్టింది. ఆర్సీబీకి కప్పు సాధించలేదు.. అని అపవాదను శాశ్వతంగా తొలగించుకుంది. ఈసాలా కప్ నమదే.. నినాదాన్ని నిజం చేసింది. ఈసాలా కప్ నమ్దూ అని ఫ్యాన్స్‌కు గర్వంగా చెప్పింది. సర్పంచ్ సాబ్ కు ఫైనల్ లో షాకిచ్చింది.

#### ఉత్కంఠ మ్యాచ్‌లో...

ఐపీఎల్ 2025 ఫైనల్‌లోపంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. 190/9 రన్స్ స్కోరు చేసింది.

మిగతా 8లో

## భూ భారతి చట్టం.. పేదల చుట్టం

### ప్రతి రైతు భూమికి భూధార్ నెంబర్ ఇస్తాం

- మనుషులకు ఆధారేట్లనో.. భూములకు భూధార్
- మీ భూములకు కాపాలదారుగా వీఆర్వోను పెడ్తం
- భూ భారతి చట్టం పేదల చుట్టం మాదిరిగా పని చేస్తుంది
- స్వాతంత్రం వచ్చినట్లుగా ఆగస్టు నాటికి ధరణి నుంచి విముక్తి
- ములుగుమాడులో భూభారతి సర్వేలో మంత్రి పొంగులేటి
- అత్యంత పారదర్శకంగా 'భూభారతి': డిప్యూటీ సీఎం భట్టి



**మహా:** వచ్చే ఆగస్టు 15 నాటికి ధరణి నుంచి పూర్తిస్థాయిలో విముక్తి కల్పిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. భూభారతితో భూ సమస్యలకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తుందని స్పష్టం చేశారు. మంగళవారం మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామంలో భూభారతి సర్వే ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రెవెన్యూ విలేజ్ లో అధికారులే గ్రామాలకు వచ్చి సర్వే చేస్తారని మంత్రి పొంగులేటి చెప్పారు. ఇక మీదట ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రైతులు తిరగనవసరంలేదన్నారు. ప్రతి రైతు భూమికి ఒక భూధార్ నెంబర్ ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో 413 రెవెన్యూ గ్రామాలలో నక్షలు లేవు, ఐదు గ్రామాలను నక్షల కోసం సర్వే చేసేందుకు ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్ట్ చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ములుగుమాడుకు కూడా ఒక్క నక్ష తయారు చేసి ఇస్తామని, ప్రతీ రెవెన్యూ విలేజ్‌కు ఒక గ్రామపాలన అధికారిని నియమిస్తామని తెలిపారు. 3,556 మంది నియామకం చేస్తున్నామని, ఇక ప్రభుత్వ రెవెన్యూ అధికారులు రైతులకు అండగా వారి భూములకు కాపలాదారుడుగా ఉంటారని ఆయన వివరించారు.

**రిజిస్ట్రేషన్ వ్యవస్థలో కూడా మార్పులు..**

రాష్ట్ర వ్యాప్తంగా భూమి లేకున్నా ఉన్నట్లుగా గత ప్రభుత్వంలోని నేతలు సృష్టించారని మంత్రి పొంగేలేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు.

మిగతా 2లో

## వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి

### మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ 24 గంటలు అందుబాటులో ఉండాలి

సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంగళవారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే గుర్తించిన 141 వాటర్ లాగింగ్ పాయింట్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ పనుల్లో పురోగతిపై ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. హార్వెస్టింగ్ వెల్స్‌లోకి చేరే వర్షపు నీటిని ఆటోమేటిక్ పంపుల ద్వారా బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలంటూ



ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

మిగతా 2లో

## సెక్స్ వర్కర్లలో కర్ణాటక టాప్!

- సెకండ్ ప్లేస్‌లో ఏపీ.. టాప్ ఫైవ్‌లో తెలంగాణ
- రెడ్ లైట్ హాట్‌స్పాట్ తెలంగాణలో అగ్రస్థానం

02



## మంత్రి పొంగులేటి చరిత్రలో నిలిచిపోతారు

### ధరణిని బంగాళాఖాతంలో వేశారు

భూ భారతి తెచ్చారు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశంసలు

**ఖమ్మం, మహా:** దొంగ పాస్ బుక్‌లకు కూడా రైతు భరోసా ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని, చెరువులు రహదారులు డొంకలు అన్నీ ఆక్రమణకు గురయ్యాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఖమ్మంలో అన్నారు. ఎన్నికల సమయంలో ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పామని, ప్రజలకు ఇచ్చిన మాట మేరకు భూ భారతి తెచ్చామని మంత్రి చెప్పారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దేశ చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ధైర్యంగా ముందుకు వచ్చారని, తమకు రాజకీయం, అధికారం శాశ్వతం కాదని, ప్రజల సమస్యల పరిష్కారమే తమకు ముఖ్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

# మిస్ వరల్డ్ పోటీల ఖర్చు రూ.30 కోట్లే

### రూ. 21 కోట్లు స్పాన్సర్ల ద్వారా వచ్చాయి

- రూ. 200 కోట్లు ఖర్చు చేశారన్నది తప్పుడు ప్రచారం
- 200 కోట్లు ఎక్కడ ఖర్చు అయ్యాయో బీఆర్ఎస్ నేతలు చెప్పాలి
- దీనిపై చర్చకు సిద్ధమా? అని సవాల్
- నిరూపించకపోతే ముక్కు నేలకు రాయాలి
- మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ ఆరోపణల్లో వాస్తవం లేదు
- దీనిపై ప్రతిపక్షాల అభూతన కల్పనలు, అవాస్తవాలను ప్రచారం చేశాయి

**మహా :** మిస్ వరల్డ్ పోటీల నిర్వహణకు సుమారు రూ. 30 కోట్ల ఖర్చు అయిందని, వీటి ద్వారా తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మంత్రి జూపల్లి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ వేదికగా తెలంగాణ పర్యాటక ప్రమోషన్, సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించడమే లక్ష్యంగా నిర్వహించిన మిస్ వరల్డ్ 2025 పోటీలు విజయవంతం అయ్యాయని, మిస్ వరల్డ్ ఈవెంట్‌ను అపూర్వ విజయంగా నిలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా మంత్రి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పర్యాటకం, హస్తకళలు, చేనేత ఉత్పత్తులకు మంచి ప్రమోషన్ వచ్చిందని, మన సంస్కృతి, సాంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను ప్రపంచానికి పరిచయం చేశామని, ఆ వేడుకల నిర్వహణ, ఆతిథ్యం పట్ల కంటెస్టెంట్లు, మిస్ వరల్డ్ సంస్థ ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు సైతం ఆనందం వ్యక్తం చేశారని చెప్పారు.

మిస్ వరల్డ్ పోటీల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు అభినందించాల్సి పోయి విమర్శలు చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. మిస్ వరల్డ్ పోటీలకు ఖర్చయింది రూ.30 కోట్లని, స్పాన్సర్ల ద్వారానే రూ.21 కోట్లు వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వానికి అయిన ఖర్చు రూ. 9 కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. మరో 10 నుంచి 11 కోట్ల ఆదాయంపై ఒప్పందాలు ఉన్నాయని వివరించారు. ఈ పోటీలపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని, గొప్పగా కార్యక్రమం నిర్వహిస్తే పలుచన చేయాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్షాల విమర్శలు చూసి నవ్వాలో ఏడ్వాలో అర్థం కావడం లేదన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు రూ.200 కోట్లు ఖర్చు ఎక్కడ అయ్యాయో చెప్పాలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. తెలంగాణ భవన్ కు రావాలా? అబిడ్స్ చౌరస్తాకు రావాలా? రూ. 200 కోట్లు ఖర్చు అయినట్లు నిరూపించకుంటే ముక్కు నేలకు రాయాలి.. అని మంత్రి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో టూరిజం ప్రమోషన్లకే రూ.115 కోట్లకు పైగా ఖర్చు చేశారని తెలిపారు. ఇంత పెద్ద ఈవెంట్ ను తక్కు ఖర్చుతో ఘనంగా నిర్వహించామని పేర్కొన్నారు.



సొంత పత్రికలు, మీడియా, సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేశారని, అందగత్తెల కాళ్లు కడిగారని విష ప్రచారం చేశారని మండిపడ్డారు. ఐఏఎస్ అధికారులతో కాళ్లు మొక్కించుకున్నఘనత కేసీఆర్ దేనని అన్నారు. కంటెస్టెంట్లకు 30 తులాల బంగారం ఇచ్చారనేది పచ్చి అబద్ధం' అని, చౌమహల్లా ప్యాలెస్ విందులో ఒక్కో ప్లేట్ భోజనానికి లక్ష రూపాయలు ఖర్చు చేశారనేది అవాస్తమని ఒక్కో ప్లేట్ కు అయిన ఖర్చు రూ. 8,200 మాత్రమేనని స్పష్టం చేశారు. తనపట్ల మిస్ బిహేవ్ చేశారని మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలను మంత్రి జూపల్లి ఖండించారు. ఆమె ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. దీనిపై కొందరు బీఆర్ఎస్ నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, అవన్ని అభూతక కల్పనలేనని చెప్పారు. మిస్ ఇంగ్లాండ్ ను ఇబ్బంది పెట్టారనేది వాస్తవం అయితే మిగతా 108 మంది పోటీదారులు చివరి వరకు ఉండేవారు కాదన్నారు. మిస్ వరల్డ్ పోటీదారులకు వచ్చిన వాళ్లు చివరిదాకా చాలా హ్యాపీగా ఉన్నారని చెప్పారు. ఏమీ జరగని దానికి ఏదో జరిగినట్టు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వాళ్లను ఇబ్బంది పెడితే.. మళ్లీ మళ్లీ తెలంగాణకు రావాలని ఉందని ఎందుకు చెబుతారని ప్రశ్నించారు మిస్ వరల్డ్ విన్నర్ గా గెలిచిన థాయిలాండ్ సుందరి ఓపల్ సుచాతకు తెలంగాణ ఆతిథ్యం, ఇక్కడి పర్యాటక ప్రాంతాలు నచ్చాయని చెప్పారు. తన జీవితంలో హైదరాబాద్ ను మరువ.. అవకాశం వస్తే మళ్లీ ఇక్కడికి వస్తానని ఓపల్ సుచాత చెప్పారన్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... మిస్ వరల్డ్ పోటీలను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతంగా నిర్వహించడాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. ప్రజల దృష్టి మరల్చేందుకు అనవసర విషయాలను లేవనెత్తుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ది కోసం అసత్యాలను ప్రచారం చేయడం తగదన్నారు.

## వారం రోజులు టైం ఇస్తున్నా..

- మిస్ వరల్డ్ పోటీలకు 200 కోట్లు ఎక్కడయ్యాయి?
- కేటీఆర్, హరీశ్ రావులు రావాలె.. దీనిపై చర్చిద్దాం
- తెలంగాణ భవన్‌కు రావాలా? అబిడ్స్ చౌరస్తాకు రావాలా?
- బీఆర్ఎస్ నేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఛాలెంజ్

**మహా:** బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. తెలంగాణ ఖ్యాతి ఖండాంతరాలు దాటుతుంటే చూసి ఓర్వలేకపోతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెల నుంచే విపక్షాలు పిల్లి శాపనార్థాలు పెడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. అంతర్జాతీయ అతిథులు రాష్ట్రానికి వస్తే విమర్శలు చేయడం తగదని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులకు సవాల్ చేస్తున్నా.. దీనిపై చర్చకు ఎక్కడకు రావాలి.. తెలంగాణ భవన్‌కు రావాలా? అబిడ్స్ చౌరస్తాకు రావాలో చెప్పాలన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు ప్రభుత్వం రూ. 200 కోట్లు ఖర్చు పెట్టిందని అంటున్నారని, ఎక్కడ అయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఖర్చు అయినట్లు నిరూపించాలని.. లేదంటే ముక్కు నేలకు రాయాలని మంత్రి సవాల్ చేశారు. కేటీఆర్, హరీశ్ రావు చెప్పిన టైమ్‌కు చర్చకు ఎక్కడికైనా వస్తానని దీనికి వారం రోజులు సమయం ఇస్తున్నానని మంత్రి అన్నారు. ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు వారు రావాలని మరోసారి ఆయన సవాల్ చేశారు.

## వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి

మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్

24 గంటలు అందుబాటులో ఉండాలి

సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి



(మొదటిపేజీ తరువాయి)

వర్షాలు, వరదలకు సంబంధించి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మానిటరింగ్ చేసేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాలు పడినప్పుడు హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్‌ఎంసీ విభాగాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నాలుగు విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న నాలాల పూడికతీత పనులు వీలైనంతగా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆయన కోరారు.

**కోర్ అర్బన్ రీజియన్ పై ప్రత్యేక దృష్టి**

ఇక సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలనున్న కోర్ అర్బన్ రీజియన్‌లో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డీసిల్టింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని చెరువులు, నాలాలు, రోడ్ల విస్తరణ, అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక పాలసీని తయారు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ అధికారులు శేషాద్రి, మాణిక్ రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హెచ్ఎండీఏ అధికారులతో పాటు ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ట్రంప్ ఫోన్‌తో మోదీ సరెండర్

### ట్రంప్ ఆదేశించగానే మోదీ భయపడ్డారు

- ఆయన ఆదేశాలు తూచా తప్పకుండా ఫాలో అయ్యిండు
- సరెండర్ కావడం బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలకు అలవాటే
- గతంలో ఇందిరా గాంధీ ఎవరికీ భయపడలే
- ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఫైర్



**మహా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ భయపడిపోయారని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కామెంట్స్ చేశారు. ఆపరేషన్ సింధూర్, ఇండో పాక్ యుద్ధ పరిస్థితులపై రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని మరోసారి టార్గెట్ చేశారు. మధ్యప్రదేశ్‌లో ఓ సభలో పాల్గొన్న ఆయన మోదీపై విమర్శలు గుప్పించారు. ఆపరేషన్ సింధూర్, ఇండియా పాకిస్తాన్ యుద్ధం హఠాత్తుగా నిలిచిపోవడంపై ఇప్పటికే వివిధ రకాల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాకిస్తాన్‌ను అణచివేసే అవకాశాన్ని ఇండియా చేజార్చుకుందనేది చాలా మంది అభిప్రాయం. ఇప్పటికే ఇదే అంశంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పలు విమర్శలు చేశారు. తాజాగా మోదీపై మరోసారి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నరేందర్..సరెండర్ అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించగానే మోదీ భయపడిపోయారని ఎద్దేవా చేశారు.

**లొంగిపోయే లేఖలు..**

ట్రంప్ భయంతోనే పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ప్రకటించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. గతంలో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో ఇందిరా గాంధీ ఎవరికీ భయపడలేదని, అప్పటి అమెరికా అధ్యక్షుడి బెదిరింపులకు లొంగిపోలేదని గుర్తు చేశారు. ఇండియా సత్తా ఏంటో అప్పుడే చైనా, పాకిస్తాన్ దేశాలకు ఇందిరా గాంధీ చూపించారని రాహుల్ గాంధీ అన్నారు. 1971 సంక్షోభ సమయంలో మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ నిర్ణయాత్మక వైఖరిని ప్రస్తావిస్తూ ఇందిరాగాంధీ ఎవరికీ భయపడలేదని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ గుర్తు చేశారు. యూఎస్ సెవెంత్ ఫ్లీట్ ముందుకు సాగినప్పుడు ఆమె నేను చేయవలసినది చేస్తానంటూ గట్టిగా చెప్పారంటూ రాహుల్ గుర్తు చేశారు. సరెండర్ కావడం బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలకు అలవాటే అంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వారికి లొంగిపోయే లేఖలు రాసే అలవాటు ఉందంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ లొంగిపోదని, గాంధీజీ, నెహ్రూజీ, సర్దార్ పటేల్.. వీరు లొంగిపోయే వ్యక్తులు కాదంటూ వ్యాఖ్యానించారు. వారు అగ్రరాజ్యాలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తులు అంటూ రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు.



## భూ భారతి చట్టం.. పేదల చుట్టం

(మొదటిపేజీ తరువాయి)

రైతుబంధు కోసం పెద్దల సహకారంతో అక్రమాలు చేశారని ఆరోపించారు. ఆనాడు ఇందిరమ్మ పేరుతో పేదలకు ఇచ్చిన భూములను ధరణితో అక్రమంగా తారు మారు చేశారన్నారు. భూ భారతి చట్టం పేదల చుట్టం మాదిరిగా పని చేస్తుందని మంత్రి వ్యాఖ్యానించారు. రిజిస్ట్రేషన్ వ్యవస్థలో కూడా మార్పులు తీసుకువస్తున్నామన్నారు. స్లాట్ బుకింగ్ పెట్టి పారదర్శకంగా రిజిస్ట్రేషన్ ప్రకియ చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రజలకు గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలు ఇస్తూనే కొత్త పథకాలు అందిస్తున్నామని వెల్లడించారు. మంగళవారం ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ సదస్సుల్లో సాదాబైనామా, మ్యూటేషన్, సర్వే నంబర్ తప్పులు, వారసత్వ సమస్యలు, నిషేధిత భూముల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఖమ్మం జిల్లాలో బోనకల్లు, నేలకొండపల్లి వంటి మండలాల్లో ఇప్పటికే పైలట్ ప్రాజెక్టుగా రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం విస్తరించారు. ఎర్రపాలెం సదస్సులో పాల్గొన్న మంత్రి పొంగులేటి భూధార్ వ్యవస్థ రైతులకు భూ రికార్డులను డిజిటలైజ్ చేసి, సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఇది రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలకు నాందిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**ఇచ్చిన మాట ప్రకారం..**

ఎక్కడైనా ప్రభుత్వ మిగులు భూములు ఉంటే వాటిని ప్రజా వినియోగం కోసం ఉపయోగించుకునేలా అసైన్‌మెంట్ కమిటీలను తిరిగి ప్రవేశ పెట్టబోతున్నామని, అలాగే భూభారతి చట్టాన్ని అత్యంత పారదర్శకంగా తీసుకు వచ్చినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రైతులకు ఎంతో ఉపయోగపడే చట్టాన్ని జాగ్రత్తగా ఈ చట్టాన్ని రూపకల్పన చేశామని, ఈ కొత్త చట్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సదస్సులు కూడా నిర్వహిస్తున్నామన్నారు. గతంలో భూమికి రకం కట్టడం వల్ల రైతులకు భూమి ఎంతో ఉందో తెలిసేది, ఏటా రకం కట్టడం వల్ల రికార్డుల్లో భూమి మారితే వెంటనే రైతులకు తెలిసేదన్నారు. కానీ గత ప్రభుత్వం నిర్వాకం వల్ల రైతులకు వివరాలు తెలియకుండా పోయిందన్నారు. భూభారతి లాంటి చట్టం మన దేశంలో చాలా అరుదుగా వస్తాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ధరణి వల్ల రైతులు ఆఫీసుల చుట్టు తిరిగి తిరిగి అలసిపోయారే తప్ప పరిష్కారం దక్కలేదన్నారు. అధికారుల నుంచి జరిగిన పొరపాట్లను కూడా సరిదిద్దలేకపోయారని విమర్శించారు. ఈ పరిస్థితిపై ఆలోచన చేసిన కాంగ్రెస్ పార్టీ ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని మాట ఇచ్చామని ఇచ్చిన మాట ప్రకారం ధరణిని తొలగించి దాని స్థానంలో భూభారతి 2025 కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. ఈ చట్టం గురించి ప్రస్తావన వచ్చిన ప్రతిసారి ప్రజా ప్రభుత్వం, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ పేరు ప్రస్తావనకు వస్తుందన్నారు. ఈ ఏడాది నాట్లు ప్రారంభం కాకముందే రైతు భరోసా నగదు రైతు ఖాతాల్లో జయ చేయనున్నట్లు మంత్రి అన్నారు.


## గోరక్ష చట్టాలు కఠినంగా అమలయ్యేలా చర్యలు తీసుకోండి

### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కోరిన విశ్వహిందూ పరిషత్

**మహా:** తెలంగాణ రాష్ట్రంలో గోవులకు రక్షణ కరువైందని, గోరక్ష చట్టాలు ఉన్నప్పటికీ వాటిని సరైన రీతిలో అమలు చేయడం లేదని విశ్వహిందూ పరిషత్ ఆరోపించింది. తెలంగాణలో గోవులకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కోరింది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర గవర్నర్ తో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర బృందం ప్రత్యేకంగా సమావేశం అయింది. ఈ సందర్భంగా గవర్నర్ కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించింది. ముక్కోటి దేవతలకు నిలయమైన గోవు పవిత్రమైన సాధు జంతువు అని.. అదేవిధంగా వ్యవసాయానికి మూలాధారమని గవర్నర్ దృష్టికి తీసుకువచ్చింది. ఆవు సుభిక్షంగా ఉంటే గ్రామ సీమలు కళకళలాడుతాయని, పాడి పరిశ్రమ అభివృద్ధి సాధిస్తుందని విశ్వహిందూ పరిషత్ నాయకులు గవర్నర్ గారికి చెప్పారు. వ్యవసాయానికి పరిమితం కాకుండా ఆవు ద్వారా లభించే పాలు, పెరుగు, నెయ్యి, వెన్న, పేడ, గోమూత్రం కూడా ఔషధంతో సమానమన్నారు. ఆవు అనేది కదిలి వచ్చే ఆయుర్వేదశాలగా చెప్పవచ్చు అని పేర్కొన్నారు. అన్నిటికీ మించి హిందువుల మనోభావాల కు సాక్షాత్కారమన్నారు. కానీ, ఓటు బ్యాంకు రాజకీయాలకు కక్కుర్తి పడిన తెలంగాణ ప్రభుత్వం గోరక్షణలో ఘోరంగా విఫలమవుతుందని పేర్కొన్నారు. గోరక్షణ కోసం చెక్ పోస్టులు ఏర్పాటు చేసినా అవి నామమాత్రంగానే ఉన్నాయని వివరించారు. జిహెచ్ఎంసి ఏర్పాటుచేసిన హోల్డింగ్ పాయింట్లలో ఎన్ని ఆవులను పట్టుకున్నారు..? వాటిని ఎక్కడ తరలించారు..? అనే లెక్కలు లేవని.. పేరుకు మాత్రం హోల్డింగ్ పాయింట్స్ ఉన్నాయని అన్నారు.

**వేములవాడలో నిత్యం కోడెద్దుల మరణ ఘోష..**

ముఖ్యంగా వేములవాడ దేవాలయ గోశాలలో నిత్యం కోడెదూడలు మరణిస్తున్నాయని విశ్వహిందూ పరిషత్ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. హిందువుల విశ్వాసాలకు ప్రతిరూపమైన వేములవాడ రాజన్న దేవాలయం లో నంది (కోడెదూడ) ఘోరమైన కన్నీరు కారుస్తోందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అయినప్పటికీ దేవాదాయ శాఖ మంత్రి, ముఖ్య కార్యదర్శి, కమిషనర్ ఇతర అధికారులు ఎవరూ కూడా సరైన రీతిలో స్పందించడం లేదని సాక్షాలతో సహా గవర్నర్ గారి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం హిందువుల మనోభావాలను గాలికి వదిలేసిందని చెప్పారు. గోరక్షణ విషయంలో విఫలమైన పోలీసులు హిందువులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. పోలీసుల ఎదుటే హిందువులపై హత్యయత్నాలు జరుగుతున్న కూడా పట్టించుకోవడంలేదని.. పైగా హిందువులపైనే, బాధితులపైనే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని సాక్షాలతో సహా ఉదాహరించారు. మొన్న సిద్ధిపేట నగరంలో వందలాదిమంది గోహంతకులు వచ్చి విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలను మట్టుపెట్టేందుకు ప్రయత్నం చేశారని చెప్పారు. ఇది నిరంతరం జరుగుతున్న ప్రక్రియ అని, కాబట్టి దీనిని ప్రత్యేక దృష్టికోణంతో ఆలోచించి గోరక్షణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని కోరారు. అందుకు ప్రభుత్వంపై తమ వంతు ఒత్తిడి తీసుకురావాలని గవర్నర్ ను విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర బృందం ప్రత్యేకంగా కోరింది. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యాలయం విజయశ్రీ భవన్ ఎదుట శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని చెప్పారు. అన్ని విషయాలను సావధానంగా విన్న గవర్నర్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి గోరక్షణ కోసం ఏ విధమైన చర్యలు తీసుకోవాలో ప్రత్యేక శ్రద్ధ పెడతానని చెప్పారు. దీనిపై లోతైన సమాచారం సేకరించి గోరక్షణ కోసం అమలు అయ్యే చట్టాలను పరిశీలిస్తానని చెప్పారు.



## నేడే కవిత మహా ధర్నా

- ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో
- కేసీఆర్‌కు కాళేశ్వరం నోటీసులకు నిరసిస్తూ ధర్నా
- కవిత కామెంట్స్‌తో బీఆర్ఎస్‌కు డ్యామేజ్‌గా భావిస్తున్న లీడర్లు!
- అటెండవుదామా.. సైలెంట్ అయిపోదామా.. పలువురు సమాలోచనలు



**మహా:** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ జారీ చేసిన నోటీసులను ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత తీవ్రంగా తప్పుబడుతున్నారు. నోటీసులకు వ్యతిరేకంగా నేడు కవిత మహా ధర్నాకు పిలుపునిచ్చారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరగనున్న ఈ మహా ధర్నాలో పెద్ద ఎత్తున కవిత అనుచరులు పాల్గొనే అవకాశముంది. గత కొన్ని రోజులుగా కవిత అంశం తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. కేసీఆర్‌కు కవిత లేఖ రాయడం, ఆపై తన తండ్రిచుట్టూ దెయ్యాలు ఉన్నాయంటూ వ్యాఖ్యానించడం రాష్ట్రంలో దుమారాన్ని రేపాయి. ఈ క్రమంలోనే ఆమె త్వరలో కొత్త పార్టీ కూడా పెట్టబోతున్నారంటూ వార్తలు ఊపందుకున్నాయి. అయితే కవిత చేస్తున్న వరుస కామెంట్స్‌తో బీఆర్ఎస్‌కు పెద్ద ఎత్తున డ్యామేజ్ జరిగిందని ఆ పార్టీ నేతలు, శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కవిత చేపట్టిన మహా ధర్నాకు వారు హాజరవుతారా? లేదా తమకు సంబంధం లేనట్లు సైలెంట్ అయిపోతారా? అన్న అంశం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. తమ పార్టీ అధినాయకుడి కోసం చేస్తున్న ధర్నా కావడంతో మనసు మార్చుకొని అయినా బీఆర్ఎస్ క్యాడర్ వెళ్తారేమోనన్న అంశం రాజకీయాల్లో సస్పెన్స్‌గా మారింది.

## సెక్స్ వర్కర్లలో కర్ణాటక టాప్!

- సెకండ్ ప్లేస్‌లో ఏపీ.. టాప్ ఫైవ్‌లో తెలంగాణ
- రెడ్ లైట్ హాట్‌స్పాట్ తెలంగాణలో అగ్రస్థానం

**మహా:** దేశవ్యాప్తంగా సెక్స్ వర్కర్ల సంఖ్య భారీగా పెరుగుతోందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. మహిళా సెక్స్ వర్కర్లు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలుగు రాష్ట్రాలు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయని తేల్చింది. ఈ మేరకు ప్రోగ్రమాటిక్ మ్యాపింగ్ అండ్ పాపులేషన్ సైజ్ ఎస్టిమేషన్ (పీఎంపీఎస్ఈ) విడుదల చేసిన నివేదిక ప్రకారం.. భారతదేశంలో మహిళా సెక్స్ వర్కర్ల సంఖ్య 9,95,499గా ఉందని అంచనా. ఈ జాబితాలో 15.4 శాతం సెక్స్ వర్కర్లతో కర్ణాటక మొదటి స్థానంలో ఉండగా ఆ తర్వాతి స్థానంలో ఆంధ్రప్రదేశ్ (12.0 శాతం), మూడో స్థానంలో మహారాష్ట్ర (9.6 శాతం), నాలుగో స్థానంలో ఢిల్లీ (8.9 శాతం), టాప్ ఫైవ్‌లో తెలంగాణ (7.6 శాతం) ఉన్నాయి. దేశంలోని మొత్తం మహిళా సెక్స్ వర్కర్లలో 53 శాతం మంది ఈ ఐదు రాష్ట్రాల్లోనే ఉన్నట్లు పీఎంపీఎస్ఈ నివేదిక పేర్కొంది. రెడ్ లైట్ హాట్‌స్పాట్‌లలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. సాంద్రత పరంగా ఒక్కో హాట్‌స్పాట్‌లో సగటున 38 మంది సెక్స్ వర్కర్లు ఉన్నారని తెలిపింది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని పేర్కొంది.

## ఎట్టి పరిస్థితుల్లో ఒప్పకోం

### బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం

- ఆపేందుకు ఏం చేయాలో అన్నీ చేస్తాం
- మరో రెండ్రోజుల్లో పూర్తి వివరాలను ప్రకటిస్తాం
- ప్రజల సహకారంతో అవసరమైతే ఉద్యమానికి సిద్ధమే?
- బనకచర్ల ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన కామెంట్స్



మహా: బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి నష్టం కలిగించే విధంగా ప్రణాళిక చేయబడుతున్న బనకచర్ల ప్రాజెక్టుపై తాము వ్యతిరేకిస్తున్నామని తేల్చి చెప్పారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడం కోసం ఇప్పటివరకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకున్నామని, ఇంకా ఏం చేయాలో ఆ దిశగా కూడా ముందుకు వెళ్తామని తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ అంశంపై మరో రెండు రోజుల్లో పూర్తి వివరాలను ప్రకటిస్తామని, బనకచర్లపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో, ఎలాంటి కార్యాచరణ తీసుకోబోతుందో త్వరలోనే తెలియజేస్తామని మంత్రి వెల్లడించారు. ఇదే సమయంలో తెలంగాణ హక్కులకు భంగం కలిగించేలా బనకచర్ల ప్రాజెక్టు రూపుదిద్దుకుంటే, అది ఎట్టి పరిస్థితుల్లోనూ మాకు ఆమోదయోగ్యం కాదని గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే బనకచర్ల అంశాన్ని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లిందని, ఈ ప్రాజెక్టుతో తెలంగాణకు కలిగే సమస్యలను స్పష్టంగా వివరించామన్నారు. ఇది కేవలం నీటి పంపకం ప్రాజెక్టు కాదని, ఇది ఒక ప్రాంతానికి నీరు మళ్లించడం వల్ల మరొక రాష్ట్రంలో నీటి కేటాయింపులపై ప్రభావం చూపే ప్రతిపాదన, ప్రాజెక్టును వ్యతిరేకించడంలో మా వైఖరి స్పష్టంగా ఉందని, ప్రజల సహకారంతో అవసరమైతే ఉద్యమం కూడా తాము ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం దీనిపై కార్యాచరణ ప్రణాళికను ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

# రేపు ఫైనల్ డిసిషన్!

## సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ

### రాజీవ్ యువ వికాసం, వానాకాలం పంటలు, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోళ్లపై చర్చ

కొలిక్కి రానున్న యువ వికాసం స్కీమ్ లబ్ధిదారుల ఎంపిక

ఉద్యోగుల సమస్యలపై కీలక చర్చకూ రంగం సిద్ధం

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ నివేదికలు కేబినెట్ ముందుకు

యాసంగి, ఈ వానాకాలం సీజన్ పెట్టుబడి సాయంపై తుది నిర్ణయం

అన్నింటిపై భేటీలో డిస్కషన్.. ఏ నిర్ణయం వస్తుందని రాజకీయ వర్గాల్లో ఆసక్తి



**మహా:** రేపు తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరగనుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మీటింగ్ ప్రారంభం కానుంది. ఈ మేరకు సీఎస్ రామకృష్ణారావు మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. అయితే కేబినెట్ భేటీలో ఏఏ అంశాలపై చర్చ జరుగుతుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అయితే విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం రాజీవ్ యువ వికాసం, వానాకాలంలో సాగుచేసే పంటలు, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోళ్లతో పాటు కాళేశ్వరం అవకతవకలపై విజిలెన్స్ ఇచ్చిన రిపోర్ట్ పై సమావేశంలో చర్చ జరిగే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అలాగే ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన ఉన్నతాధికారుల కమిటీ తన నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి అందజేసింది. నివేదికలోని అంశాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు వివరించినట్లు సమాచారం. అయితే ఈ విషయంలో మంత్రివర్గం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అలాగే త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ అంశంపై కూడా ఏదైనా నిర్ణయం వస్తుందా అని రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

**యువ వికాసం ఎవరికో..**

రాజీవ్ యువ వికాసం పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 16.23 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. ఇందులోంచి 5 లక్షల మంది లబ్ధిదారులను ఎంపిక చేసి స్వయం ఉపాధి కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ నేపథ్యంలో ఈ నెల 2 నుంచి 9 వరకు రుణ మంజూరు పత్రాలు పంపిణీ జరుగుతుందని అంతా ఎదురుచూశారు. మొదటి విడతలో రూ. 50వేల నుంచి రూ.లక్షలోపు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మాత్రమే మంజూరు పత్రాలు అందజేస్తామని ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. కేటగిరీ 1లో రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు దరఖాస్తుదారుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. దాదాపు 2.8 లక్షల మందికి ఈ కేటగిరీ కింద యూనిట్లు మంజూరు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం కాగా 1,32,634 మందే దరఖాస్తు చేసుకున్నారు. రూ .50వేలలోపు యూనిట్ కు పూర్తి రాయితీ ప్రకటించినా 39,401 మంది మాత్రమే దరఖాస్తు చేశారు. రూ.లక్ష లోపు యూనిట్లకు 90 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఈ కేటగిరీల్లో 93,233 దరఖాస్తులు వచ్చాయి. గరిష్ఠ ధర రూ.4 లక్షలు కలిగిన యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకే ఎక్కువ మంది ఆసక్తి చూపారు. అయితే దరఖాస్తులో పేర్కొన్న యూనిట్లను ఆ తర్వాత కూడా అభ్యర్థి మార్చుకునే వెసులుబాటు ఉండడంతో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది.

**ఉద్యోగుల సమస్యలపై..**

ఉద్యోగుల సమస్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఇప్పటికే కమిటీ తన నివేదికను అందించింది. ఆ నివేదికపై సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు సమావేశంలో భట్టి విక్రమార్క వివరించారు. దీనిపై కేబినెట్ లో చర్చించి ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకోనున్నారు. ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిధులను ప్రతినెలా కొంత మొత్తం చెల్లించేలా యాక్షన్ ప్లాన్ రెడీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. గత ప్రభుత్వం మూడు డీఏలను చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందని, దానివల్ల ఇప్పుడు ఒకేసారి చెల్లింపులకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్, సర్వీసుల్లో ఉన్నోళ్ల జీపీఎఫ్ ఇతర బిల్లులను క్లియర్ చేయాల్సిన అవసరం ఉందని.. మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ ఇప్పటికే ఇచ్చిన నివేదికలో ఈ అంశాలు ఉన్నందున మంత్రివర్గంలో చర్చించి ఆమోదం తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమైంది.

**పెట్టుబడి సాయంపై నిర్ణయం..**

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మంత్రులు అభినందించారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో విత్తనాల సమస్య రాకుండా చూసుకోవాలని, బ్యాంకులు క్రాప్ లోన్లు కూడా త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయమై జిల్లా యంత్రాంగంతో మంత్రులు సమీక్షలు నిర్వహించాలని ఆయన సూచించారు. వానాకాలం సీజన్ ముందే రావడంతో రైతు భరోసాపై మంత్రులు సీఎం రేవంత్ దగ్గర ప్రస్తావించినట్లు తెలిసింది. దీంతో పెండింగ్‌లో ఉన్న యాసంగి పెట్టుబడి సాయం, ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయంపైనా రేపు నిర్వహించే కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకొనున్నారు.

## చిలకలూరిపేటలోని సాయికార్తీక్ సిటీ సెంటర్ అన్యాయంగా ఆక్రమించారు

### మా ఆస్తులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు అనుచరులు కబ్జా చేశారు

చంపేస్తామంటూ బెదిరిస్తున్నారు.. మమ్మల్ని కాపాడండి, న్యాయం చేయండి

తల్లి తండ్రితో కలిసి ప్రెస్ మీట్ లో గోడు వెళ్లబోసుకున్న బాధితుడు ఎన్నారై రావి మురళి మోహన్

ఆంధ్రప్రదేశ్ లో కేసు పట్టించుకోవడం లేదు.. మీడియాలో రాకుండా కుట్ర చేస్తున్నారు

హైదరాబాద్ మీడియా ముందు ఎన్నారై కుటుంబం ఆవేదన



**మహా :** సాయికార్తీక్ సిటీ సెంటర్ షాపింగ్ కాంప్లెక్స్‌పై ఆగస్టు 5, 2024 నుంచి స్థానిక రాజకీయ నాయకులు, వారి అనుచరులు అక్రమంగా ఆక్రమించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కాంప్లెక్స్ యజమాని, అమెరికాలో ఉద్యోగం చేస్తున్న ఎన్ఆర్ఐ రావి మురళి మోహన్, తన జీవిత సంపాదనతో నిర్మించిన ఈ 60 కోట్ల విలువైన ఆస్తిని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నాయకులు, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అనుచరులు కబ్జా చేసినట్లు ఆరోపించారు. ఈ విషయంపై న్యాయం కోసం పోలీసులు, జాతీయ మానవ హక్కుల కమిషన్, హైకోర్టును ఆశ్రయించినప్పటికీ, స్థానిక అధికారుల సహకారం లభించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాయికార్తీక్ సిటీ సెంటర్‌లో రెండు థియేటర్లు, రెండు ఫంక్షన్ హాళ్లు, రెండు అంతస్తుల వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. ఈ కాంప్లెక్స్‌ను ఆక్రమించిన వ్యక్తులు ఎవరినీ లోపలికి అనుమతించకుండా ఆంక్షలు విధించారు. మురళి రావి తెలిపిన వివరాల ప్రకారం, తన తండ్రి కందిమల్ల అంజిబాబు అనే వ్యక్తి నుంచి 97 లక్షల రూపాయల అప్పు తీసుకున్నారని, దాని ఆధారంగా కొందరు ఈ ఆస్తిని ఆక్రమించారని ఆరోపణలు చేస్తున్నారు. అయితే, ఈ అప్పుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు ఆక్రమణదారులు అందించలేదని, అప్పు నిజమైతే చెల్లించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మురళి రావి స్పష్టం చేశారు.

ఈ ఆక్రమణ కారణంగా కాంప్లెక్స్‌లో పనిచేసే 40 మందికి పైగా ఉద్యోగులు జీవనోపాధిని కోల్పోయారు. పక్కనే ఉన్న ఐస్ ఫ్యాక్టరీ కూడా మూతపడటంతో అక్కడి కార్మికులు కూడా ఆదాయం కోల్పోతున్నారు. మురళి రావి తల్లి, క్యాన్సర్ సర్వైవర్, ఈ ఆస్తి పక్కనే ఒంటరిగా నివసిస్తుండగా, ఆక్రమణదారులు ఆమెకు ఆహారం, ఔషధాలు అందకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. సీసీటీవీ వైర్లు ధ్వంసం, ఇంటర్నెట్ సౌకర్యం నిలిపివేత వంటి చర్యలతో ఆక్రమణదారులు ఆస్తిని పూర్తిగా నియంత్రణలోకి తీసుకున్నారని ఆయన తెలిపారు. మురళి రావి ఈ విషయంపై చిలకలూరిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు దీనిని సివిల్ విషయంగా పరిగణించి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. దీంతో ఆయన జాతీయ మానవ హక్కుల కమిషన్, హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చినప్పటికీ, స్థానిక పోలీసులు దానిని అమలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అనుచరుల ప్రమేయం కారణంగా పోలీసులు సహకరించడం లేదని, తనపై, కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు పెడుతూ, ప్రాణహాని బెదిరింపులు చేస్తున్నారని ఆయన తెలిపారు. తమ ఆవేదన ఆంధ్రప్రదేశ్ మీడియాలో రాకుండా కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ మీడియా ముందు మురళి రావి తల్లి, తండ్రితో కలిసి తమ గోడు వెళ్ళబోసుకున్నారు.

మురళి రావి ఈ విషయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లకు ఫిర్యాదు చేశారు. అయితే, స్థానిక ఇన్‌స్పెక్టర్, టీడీపీ నాయకుల బినామీలు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని ఆయన ఆరోపించారు. బ్యాంకు రుణాలతో ఈ కాంప్లెక్స్‌ను నిర్మించిన మురళి, తన స్వగ్రామాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చేసిన పెట్టుబడి ఇప్పుడు కబ్జాకు గురై, తన కుటుంబం ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మురళి రావి తన ఆస్తిని తిరిగి పొంది, కాంప్లెక్స్‌ను తెరిపించి వ్యాపారం కొనసాగించేందుకు అధికారులు సహకరించాలని కోరారు. అప్పు ఆరోపణలు నిరూపితమైతే, ఆ డబ్బులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని, కానీ బలవంతంగా ఆక్రమణకు లొంగబోనని స్పష్టం చేశారు. ఈ వివాదం వెనుక రాజకీయ ఒత్తిళ్లు, స్థానిక పోలీసుల నిర్లక్ష్యం ఉన్నాయని ఆరోపిస్తూ, న్యాయం కోసం పోరాటం కొనసాగిస్తానని మురళి రావి పేర్కొన్నారు.

## నష్టాలు కాదు, ఫలితామే ముఖ్యం

### ఆపరేషన్ సిందూర్ పై సీడీఎస్ అనిల్ చౌహాన్

ఉగ్రవాదంపై మండిపాటు



**మహా :** పాకిస్థాన్ లోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌పై సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధంలో నష్టాలు ముఖ్యం కావని, ఫలితమే ముఖ్యమన్నారు. మహారాష్ట్రలోని పుణెలోని సావిత్రిబాయి పులే విశ్వవిద్యాలయంలో ఓ ప్రత్యేక ఉపన్యాసంలో పాక్, ఉగ్రవాదంపై సీడీఎస్ మండిపడ్డారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత్ వైపు జరిగిన నష్టాల గురించి నన్ను అడుగుతున్నారు. అసలు ఆపరేషన్ సమయంలో నష్టాలు కావు. ఫలితాలే ముఖ్యం. నష్టాల గురించి మాట్లాడటం సరైనది కాదు. మీరు క్రికెట్ టెస్ట్ మ్యాచ్ కు వెళ్లి ఇన్నింగ్స్ తేడాతో గెలిస్తే, ఎన్ని వికెట్లు, ఎన్ని బంతులు, ఎంత మంది ఆటగాళ్లు అనే ప్రశ్నే ఉండదు. మేము ఆపరేషన్ సమయంలో శత్రు దేశానికి చెందిన ఎన్ని విమానాలను, రాడార్లను నాశనం చేశామని తెలియజేస్తాం. పాక్ పై జరిపిన ఆపరేషన్లు ఎనిమిది గంటల్లో ముగిశాయి. వెంటనే పాక్ కాల్పుల విరమణకు పిలుపునివ్వాల్సి వచ్చిందని అనిల్ చౌహాన్ అన్నారు.

మే 10వ తేదీన అర్ధరాత్రి ఒంటి గంటకు దాడులు ప్రారంభం అయ్యాయని, 48 గంటల్లో భారత్‌ను మోకరిల్లేలా చేయాలనే ఉద్దేశంతో పాకిస్థాన్ తొలుత ఈ దాడులను చేపట్టిందని సీడీఎస్ అనిల్ చౌహాన్ తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘించడం, కవ్వింపు చర్యలకు పాల్పడడం వంటి రెచ్చగొట్టే చర్యల ద్వారా భారత్‌తో యుద్ధ తీవ్రతను పెంచడానికి కారణమైందన్నారు. నిజానికి భారత ఆర్మీ ఉద్దేశం మాత్రం పాక్, పీఓకేలో గల ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేయడమేనని, దాన్ని సాధించామని పేర్కొన్నారు. ఉగ్రమూకల ఏరివేత 48 గంటల పాటు కొనసాగుతాయని పాక్ భావించిందని, ఈ ఆపరేషన్ దాదాపు 8 గంటల్లో ముగిసిపోయిందని చెప్పారు.

**పహల్గాం ఉగ్రదాడి వల్లే**

ఈ యుద్ధానికి ప్రధాన కారణం పహల్గామ్ ఉగ్రవాద దాడేనని అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. ఉగ్రవాద దాడులకు ఎలాంటి హేతుబద్ధత లేదని, దాన్ని యుద్ధంగా పరిగణించలేమని తేల్చి చెప్పారు. భారత్‌ను రక్తసిక్తం చేయాలని పాక్ నిర్ణయించిందన్నారు. 1965లో జుల్ఫికర్ అలీ భుట్టో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ప్రసంగిస్తూ భారత్‌పై 1,000 సంవత్సరాల యుద్ధాన్ని ప్రకటించాడని గుర్తు చేసుకున్నారు. ప్రొఫెషనల్ మిలిటరీ దళాలు ఎదురు దెబ్బలు లేదా నష్టాల వల్ల ప్రభావితం కావు. పాకిస్థాన్ నుంచి ప్రాయోజిత ఉగ్రవాదం ఆగిపోవాలి. భారత్ ఉగ్రవాదం, అణు బ్లాక్ మెయిల్ నీడలో జీవించదు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత సాయుధ దళాలు తమ స్థాయిని పెంచుకున్నాయి. పహల్గాం ఉగ్రవాద దాడికి కొన్ని వారాల ముందు పాక్ సైన్యాధిపతి అసిమ్ మునీర్ భారత్, హిందువులపై విషం కక్కారు అని సీడీఎస్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు.

## ఆ రోజున కేసీఆర్ కనీసం బయటకు రాలేదు..

## కేటీఆర్ అమెరికా వెళ్లారు

### గడప దాటని కేసీఆర్, అమెరికాలో కేటీఆర్

జూన్ 2న కేసీఆర్, కేటీఆర్ వేడుకలకు గైర్హాజరు.. కనీసం అమరవీరులకు కేసీఆర్ నివాళులర్పించలేదు

అధికారం కోల్పోతే ప్రజల్లోకి రాకూడదనేది బీఆర్ఎస్ సిద్ధాంతమా: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**మహా :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అంగరంగ వైభవంగా నిర్వహించిందని, అయితే ఈ సంబరాల్లో బీఆర్ఎస్ నేతలు పాల్గొనకపోవడం విచారకరమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు బీఆర్ఎస్ దూరంగా ఉందని ఆరోపించారు. "రాష్ట్రం ఏర్పడిన రోజున కేసీఆర్ కనీసం బయటకు రాలేదు. అమరవీరులకు నివాళులు కూడా అర్పించలేదు. ఇక కేటీఆర్ అయితే అమెరికా పర్యటనకు వెళ్లారు. ఆయన కూడా రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాలుపంచుకోలేదు" అని ఆయన పేర్కొన్నారు. అధికారం చేతిలో ఉన్నప్పుడే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం గుర్తుంటుందా? అని ఆది శ్రీనివాస్ బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. "అధికారం లేకపోతే ప్రజల మధ్యకు వచ్చేది లేదన్నట్లుగా బీఆర్ఎస్ నాయకులు ఒక సంకేతాన్ని ప్రజలకు పంపారు. ఇది వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం" అని ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. "రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 25.35 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసింది. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు అండగా నిలుస్తున్నాం. కానీ, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీని ఎప్పుడూ సక్రమంగా, పూర్తిస్థాయిలో అమలు చేయలేదు" అని ఆది శ్రీనివాస్ ఆరోపించారు.

## సే నో టూ ప్లాస్టిక్

### పీసీబీ పోస్టర్ ను విడుదల చేసిన మంత్రి కొండా సురేఖ

ఈ మహత్తర ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యవ్వాలన్న మంత్రి




**మహా :** తెలంగాణ రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపు నిచ్చారు. తెలంగాణలో ఎవరూ ప్లాస్టిక్ వాడొద్దని.. పర్యావరణాన్ని నష్టపరచొద్దన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) పోస్టరును మంగళవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం2025 సందర్భంగా "ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం" అనే థీమ్‌తో పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, ఈ పోస్టర్లు పర్యావరణం, వన్యప్రాణులు, మానవ ఆరోగ్యంపై ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే హానికరమైన ప్రభావాల గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయన్నారు. స్థిరమైన పద్ధతులను అవలంభించడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, రీసైక్లింగ్ చేయడం, సరైన వ్యర్థాల నిర్వహణ అవసరాన్ని మంత్రి నొక్కి చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో సమాజ భాగస్వామ్యాన్ని, వ్యక్తులు పాల్గొనేలా ప్రోత్సహించి ప్లాస్టిక్ కాలుష్యానికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ సూచించారు. పర్యావరణ సమస్యలను పరిష్కరించడంలో, స్థిరత్వాన్ని ప్రోత్సహించడంలో రాష్ట్రం ప్రభుత్వ నిబద్ధతను మంత్రి నొక్కి చెప్పారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో టీజీ పీసీబీ మెంబర్ సెక్రటరీ గుగులోత్ రవి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

### ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి




**అబ్దుల్లాపూర్‌మెట్, మహా:** రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో రైతు నివేదిక అవరణంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తితంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ''భూభారతి''చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. చట్టాన్ని అధికారులు సక్రమంగా అమలు చేయాలని సూచించారు. భూ హక్కులు కలిగి ఉన్న వారికి ఈ చట్టం ద్వారా తగు న్యాయం జరుగుతుందన్నారు. గత పాలకులు అసైన్డ్, వక్స్‌బోర్డు, సీలింగ్, భూదాన్, ఎండోమెంట్ భూములను కొల్లకొట్టారన్నారు. ఆ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకొని పేదలకు పంచుతామని తెలిపారు. ఈ ప్రాంతంలో వందలకోట్ల విలువ చేసే.. వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను అక్రమార్కులు అక్రమంగా ఆక్రమించుకున్నారని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్నారు. కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ నిరుపేదలకు వర్గంలాంటిదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు.

## హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

### రూ. 2 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్.. ఏపీ కానిస్టేబుల్ సహా ఆరుగురు అరెస్ట్



**మహా :** హైదరాబాద్ కూకట్‌పల్లిలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. సుమారు రూ.2 కోట్ల విలువైన డ్రగ్స్‌ను తరలిస్తుండగా సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు ఆరుగురు ముఠా సభ్యులను అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి చెందిన ఒక కానిస్టేబుల్ ఉండటం సంచలనంగా మారింది. వీరు బాపట్ల జిల్లా అద్దంకి నుంచి కూకట్‌పల్లికి ఈ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులకు పట్టుబడిన వారిలో తిరుపతికి చెందిన కానిస్టేబుల్ గుణశేఖర్, తిరుపతి రూరల్‌కు చెందిన ఉన్నం సురేంద్ర, బాపట్ల జిల్లాకు చెందిన దొంతి రెడ్డి హరిబాబు రెడ్డి , అద్దంకి మండలానికి చెందిన చెగుడు మెర్సీ మార్గరెట్, షేక్ మస్తాన్ వలీ , దేవరాజు యేసుబాబు ఉన్నారు. కానిస్టేబుల్ గుణశేఖర్ వద్ద నుంచి 840 గ్రాముల కొకైన్, ఇతర డ్రగ్స్, నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఓటీ అధికారులు తెలిపారు. వీరంతా గత కొద్ది రోజులుగా డ్రగ్స్ దందా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు డ్రగ్స్ ముఠాకు సంబంధించిన పూర్తి వివరాలు, వారి నెట్‌వర్క్‌ను తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు. అయితే సమాజంలో గౌరవ ప్రదమైన పోలీస్ ఉద్యోగంలో ఉన్న గుణశేఖర్ ఇలాంటి పని చేయటంపై పోలీసు వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. డ్రగ్స్ కేసులో పోలీసు ఉద్యోగంలో ఉన్న వ్యక్తి పట్టుబడటం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది రాష్ట్రంలో డ్రగ్స్ అక్రమ రవాణా ఏ స్థాయిలో జరుగుతుందో మరోసారి రుజువు చేస్తోంది.

## హైదరాబాద్ జలమండలి మహా విస్తరణ

### ఔటర్ రింగు రోడ్డు వెలుపల ఉన్న గ్రామాలకూ సేవలు.. చర్యలు చేపట్టిన అధికారులు



**మహా :** హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సేవలు అందిస్తున్న జలమండలి తన పరిధిని విస్తరించడానికి సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్న జలమండలి.. ఇకపై వెలుపల ఉన్న ప్రాంతాలకూ నీటిని అందించేలా కార్యాచరణ రూపొందిస్తోంది. దీనిపై అధికారులు ఇప్పటికే ప్రాథమిక ప్రణాళికను సిద్ధం చేశారు. హైదరాబాద్ రీజినల్ రింగ్‌రోడ్డు లోపల అభివృద్ధికి మార్గం సుగమం అవుతున్న నేపథ్యంలో జలమండలి పరిధిని విస్తరించడం ద్వారా భవిష్యత్ తాగునీటి అవసరాలను తీర్చవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న శంషాబాద్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, నార్సింగి, తుక్కుగూడ, పెద్దఅంబర్‌పేట, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తెల్లాపూర్, తూంకుంట, అమీన్‌పూర్ మున్సిపాలిటీలు ఓఆర్ఆర్‌కు అటూఇటూ విస్తరించి ఉన్నాయి. వీటి పరిధిలోని కొన్ని గ్రామాలు ఔటర్ రింగు రోడ్డు వెలుపలా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో భారీగా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జరుగుతుండటంతో.. తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ మేరకు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఇటీవల విస్తరణ ప్రణాళికపై అధికారులతో సమీక్షించారు. గోదావరి 2,3 దశల ప్రాజెక్టుకు త్వరలో శంకుస్థాపన చేయనున్నారు. రూ. 7360 కోట్లతో 20 టీఎంసీల గోదావరి జలాలు హైదరాబాద్ నగరానికి సరఫరా కానున్నాయి. ఇందులో 15 టీఎంసీలను నేరుగా తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. రెండేళ్లలో ఈ జలాలు అందుబాటులోకి రానుండటంతో.. దీనికి అనుగుణంగా కొత్త ప్రాంతాలకు నీటిని అందించేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం జల మండలి 13.72 లక్షల కనెక్షన్లు కలిగి ఉంది. 1.30 కోట్ల జనాభాకు 550 ఎంజీడీల ( మిలియన్ గ్యాలన్స్ పర్ డే) నీటిని ప్రతి రోజూ సరఫరా చేస్తుంది. జలమండలి విస్తరణతో హైదరాబాద్ దాని పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన తాగునీటి సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల ప్రజలు బోర్లు, ప్రైవేటు వాహనాల ద్వారా నీటికి కొనుక్కొని తాగుతున్నారు. జల మండలి విస్తరణతో ఎలాంటి తాగునీటి ఇబ్బందులు ఉండవని అధికారులు అంటున్నారు.

EDITORIAL సంపాదకీయం

# తెలంగాణ వచ్చినా దశాబ్దంగా దగా





- కప్పర ప్రసాద్ రావు
సీనియర్ జర్నలిస్ట్

తెలంగాణ స్వతంత్ర రాష్ట్రం అయినా స్వేచ్ఛాయుత పాలన సాగడం లేదనేది స్పష్టంగా అవగతమవుతోంది. ఆంధ్రా పాలకుల సూచనలు, ఆజ్ఞలు ఇంకా తెలంగాణాలో అమలవుతూనే ఉన్నాయి. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి ఏకాదశ ఏండ్లు దాటింది. గత దశాబ్దంలో సాధించింది ఏమిటన్నది బేరీజు వేస్తే కాలమంతా కాళేశ్వరం చుట్టే తిరిగింది. టీఆర్ఎస్ బీఆర్ఎస్ గా మారడంతో తెలంగాణ పదం కూడా ఆ పార్టీలో కనుమరుగయింది. అవినీతి పెచ్చు పెరిగిపోయింది. మొదటి ఐదేళ్ళలోనే అహంకారం తలకెక్కింది. నాకేమీ ఎదురులేదు. నేను చెప్పిందే వేదం అన్న చందంగా సాగింది. తెలంగాణ ఉద్యమ పుణ్యమా అని మొదటిసారి ప్రజలు అధికారం ఇస్తే రెండో సారి డబుల్ బెడ్‌రూం ఇండ్లు వస్తాయన్న ఆశతోనే అధికారం లభించింది. అధికారం నెత్తికెక్కితే అందలం ఎక్కించిన ప్రజలే అథపాతాళానికి తొక్కుతారన్నది వాస్తవ రూపం దాల్చింది. దశాబ్ద కాలం ఎదురు లేకుండా పాలించిన గులాబీ పాలకులు గద్దెదిగాల్సి వచ్చింది. అధికారం శాశ్వతం కాదన్నది అవగతమైంది. ఇక ఆ పాలనను పరిశీలించాల్సివస్తే ఆ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు ఒక్కటి కూడా పూర్తిగా ప్రజలకు చేరలేదన్నది సుస్పష్టం. ఓట్లను కొనుగోలు చేసేందుకే పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కూడా గత పాలకులకే దక్కుతుంది. సంక్షోభ సమయంలో పార్టీని కాపాడుకునేందుకు ప్రభుత్వ ఖజానాను వాడుకున్నది కూడా టీఆర్ఎస్ ప్రభుత్వమే. పార్టీలో కుంపటి రగిలి ఈటెల రాజేందర్ బయటకు వస్తే హుజురాబాద్ ఉప ఎన్నికను ఎదుర్కొనేందుకు దళిత బంధు పథకాన్ని తెచ్చింది. బీసి ఓట్ల కోసం బీసి బంధు, మైనార్టీ బంధుల పేరుతో ఓట్ల కొనుగోలు వ్యూహాన్ని ప్రారంభించింది. కానీ ఇవేవీ ఆ పార్టీని విజయ తీరం వైపు తీసుకు పోలేక పోయాయి. తద్వారా ఆ పార్టీ ఓటమి పాలు కాక తప్పలేదు. తెలంగాణ ఆత్మలేని పాలన కొనసాగింది. స్వతంత్ర తెలంగాణ కోసం పోరాటం చేసిన ప్రజానీకం ఇదేం తెలంగాణ ఇందుకేనా మనం కొట్లాడింది అన్న భావన కలిగేలా కేసిఆర్ పాలన సాగింది.

జీహెచ్ఎంసీ ఎన్నికలలో ఆంధ్రా వాళ్ల ఓట్ల కోసం ఆంధ్ర వారి కాలిలో ముల్లు గుచ్చితే తాను పంటితో తీస్తానని కేసీఆర్ స్వయంగా ప్రకటించారు. ఇది గమనిస్తేనే వారు మన రాష్ట్రంలో ఎంత బలవంతులో అర్థం అయ్యింది. వారి ఓట్లు లేక పోతే గెలవలేమన్న భావనతో తెలంగాణ ఆత్మను పక్కన పెట్టి తెలంగాణను ఒక పదంగానే మార్చి వేశారు. తెలంగాణ పార్టీకి జిల్లా అధ్యక్షులుగా కూడా ఆంధ్రా వారినే నియమించడం, ఆంధ్రాలో జగన్ తో కలిసి తెలంగాణ వనరులను వారికి తాకట్టు పెట్టడం, తెలంగాణ కాంట్రాక్టర్ లను పక్కన పెట్టి ఆంధ్రా కాంట్రాక్టర్‌లకు పెద్ద పీట వేయడం, తెలంగాణ సినిమా ఇండస్ట్రీని పూర్తిగా విస్మరించి ఆంధ్రా వలసవాదులకే పట్టం కట్టడం, తెలంగాణాలో సినిమా నిర్మాతలకు ప్రోత్సాహం ఇవ్వక పోవడం, పారిశ్రామిక రంగంలో కూడా తెలంగాణ పారిశ్రామిక వేత్తలను పక్కన పెట్టి ఆంధ్రా పారిశ్రామిక వేత్తలను నెత్తికెత్తు కోవడం, వ్యాపార రంగం ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో తెలంగాణ కంపెనీలు కనుమరుగు దశకు చేరాయి. ఇక్కడి భూములను కూడా ఆంధ్రా కంపెనీలకు కట్టపెట్టి వారి వ్యాపారాభివృద్ధికి నాటి ప్రభుత్వం కృషి చేయడం లాంటిని గమనిస్తే పేరులోనే తెలంగాణ తప్ప పాలనంతా ఆంధ్రా వారిదేననే భావన ఇక్కడి ప్రజలో వచ్చింది. ప్రైవేట్ పాఠశాలల విషయానికి వస్తే ఉద్యమ సమయంలో నారాయణ, శ్రీచైతన్య లాంటి పాఠశాలలను వారి విద్యా వ్యాపారాన్ని తీవ్రంగా విమర్శించి తెలంగాణ నుంచి వారిని తమిమేస్తామని ప్రకటించిన నాటి టీఆర్ఎస్, నేటి బీఆర్ఎస్ ఆ పాఠశాలల యాజమాన్యాలకే దాసోహం అయ్యాయి. తెలంగాణ ఉద్యమంలో పాఠశాలలు మూసేసి, ఉద్యమంలో ముందు వరుసలో నిడిచిన తెలంగాణ పాఠశాలల యాజమాన్య సంఘాలు నేడు పాఠశాలలు నడవక ఇబ్బందులు పడుతున్నాయి. తెలంగాణ వస్తే ఆంధ్రా విద్యా భూతాలు పారి పోతాయనుకుంటే అవే నేడు మన పాలకులకు దేవతలయ్యాయి.

ఇక మీడియా రంగానికి వస్తే కొత్తగా చెప్పేదేమీ లేదు. ఇప్పటికీ ఆంధ్రా మీడియా పెద్దరికమే, పెత్తందారీ తనమే కొనసాగుతున్నది. నాటి పోరాటాన్ని వక్రీకరించి చూపిన టీవీ ఛానళ్లు, పేపర్లు తెలంగాణ నుంచి వెలివేయపడతాయని ప్రజలు భావించారు. కానీ మన పాలకులు వాటికే దాసోహమై ఇప్పటికీ వాటినే భుజాన మోస్తున్నారు. నాడు తెలంగాణ కోసం ఉద్యమించిన జర్నలిస్టులు నేడు ఆదరించే దిక్కులేక నాడు అవమానించిన యాజమాన్యాల పంచనే పడి ఛస్తున్నారు. సాహిత్యం విషయంలో కూడా ఇదే ఇబ్బంది. ఉద్యమ కాలంలో తెలంగాణ సాహిత్యం పెద్ద ఎత్తున వెలుగులోకి వచ్చింది. తెలంగాణకు జరిగిన అన్యాయాలను బయట పెడుతూ సాహిత్య కారులు, కవులు, రచయితలు, కళా కారులు ప్రజలను చైతన్య వంతులను చేశారు. కానీ తెలంగాణ వచ్చినాక సాహిత్యం కూడా ఆగమైపోయింది. ఇప్పటికీ తెలంగాణ భాషను, యాసను వెక్కిరిస్తూనే ఉన్నారు. నాడు తెలంగాణ కోసం ఆడి పాడిన కళాకారులను ప్రభుత్వాలు పట్టించుకోనే లేదు. సాహిత్య రంగంలో కూడా ఆంధ్రా ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నది.

తెలంగాణ వచ్చింది నిజమే కానీ సమైక్య రాష్ట్రంలో అక్రమంగా వచ్చి అడ్డదారిన ఉద్యోగాలు పొందిన వారెవ్వరూ తెలంగాణ నుంచి వెల్లలేదు. తెలంగాణ వాళ్లకి దక్కాల్సిన ఉద్యోగాలు దక్కనే లేదు. ఇలా ఏ రంగంలో తీసుకున్నా రాష్ట్రం వచ్చిన తరువాత మార్పు ఏమాత్రం కనిపించడమే లేదు. భౌగోళిక తెలంగాణ వచ్చింది. పాలకులు మారారు. కానీ పాలన మాత్రం మారలేదు. అందుకే విసుగు చెందిన తెలంగాణ ప్రజలు గులాబీ పాలనను నేల కూల్చారు. తెలంగాణ కు పట్టిన గులాబీ చీడను వదిల్చారు. కానీ ప్రస్తుత పాలకులు కూడా అదే బాటలో పయనిస్తున్నట్లే కనిపిస్తున్నది. అపరిపక్వపు మాటలు, అనాలోచిత చర్యల మూలంగా ఆభాసు పాలవుతున్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను పరిశీలించి అవి పునరావృతం కాకుండా చూసుకోకుంటే వారికి పట్టిన గతే ఈ పాలకులకూ పడుతుంది. కాంగ్రెస్ లో కూడా తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించిన నాయకులకు తగిన పదవులు దక్కలేదన్న అసంతృప్తి స్పష్టంగా కనిపిస్తున్నది. ఇంకెక్కడి తెలంగాణ వాదం రాష్ట్రం సిద్ధించిన తరువాత కూడా ఇంకా సెంటిమెంట్ ఉంటుందా అని ప్రశ్నించే వారి సంఖ్య ప్రభుత్వంలో పెరుగుతూనే ఉంది. కానీ ఇదే సెంటిమెంట్‌ను మరోసారి ఆయుధంగా మార్చుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నిస్తున్నది. తెలంగాణ పెటేంట్ హక్కు తమకే ఉన్నదన్నట్లు ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారు. కాంగ్రేస్ పాలకుల తీరు వారికి ఆయుధాలను అందిస్తున్నట్లు గా ఉన్నది. బీఆర్ఎస్ పాలనకు కాపీ లాగే ఈ కాంగ్రెస్ పాలన కూడా సాగితే ఇక రాబోయే ఎన్నికలలో గడ్డు పరిస్తితి ఎదుర్కొనాల్సి వస్తుంది.

## ఉద్విగ్న క్షణాలు




## సోషల్ మీడియాలో లేకపోయినా నో వీసా

### యూఎస్ నిబంధనలతో జనాల్లో టెన్షన్

### షాకుల మీద షాకులిస్తున్న ట్రంప్




**మహా:** హార్వర్డ్ యూనివర్సిటీలో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకునే విదేశీయుల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తామని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో ఇటీవల తెలిపారు. ఈ మేరకు మార్గదర్శకాలను వివిధ దేశాల్లోని అమెరికా ఎంబసీలకు పంపించారు. సోషల్ మీడియాలో లేని వారు, తమ అకౌంట్‌లను బయటి వారు చూడకుండా ఆంక్షలు పెట్టేవారి వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. అంటే, సోషల్ మీడియాలో లేని దరఖాస్తుదారులను కాన్సులార్ అధికారులు అనుమానాస్పదులుగా, తప్పించుకుని తిరిగే వారిగా భావించే ప్రమాదం ఉందని పరిశీలకులు అంటున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్‌లు, గెస్ట్ స్పీకర్లు, టూరిస్టులు.. ఇలా హార్వర్డ్‌ను సందర్శించాలనుకునే వారందరికీ తాజా నిబంధన వర్తిస్తుందని మంత్రి రూబియో తెలిపారు. విదేశీయుల విషయంలో అమెరికా నిబంధనలు మరింత కఠినం చేయనుందనే దానికి సంకేతంగా తాజాగా రూల్స్‌ను భావించాలని పరిశీలకులు చెబుతున్నారు. వీసా ఇంటర్వ్యూలకు సంబంధించి భద్రతా ప్రమాణాల పునఃపరిశీలన కోసం ఉద్దేశించిన పైలట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ నిబంధనలను అమెరికా రూపొందించింది. ఈ నిబంధనలపై న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త విధానంతో ఎవరికీ ప్రయోజనం ఉండదని చెబుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేక కంటెంట్ పోస్టు చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో యాక్టివ్‌గా లేకపోయినా అభ్యర్థులు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. వ్యక్తిగత గోప్యత, భావప్రకటనా స్వేచ్ఛ హద్దులను అతిక్రమించేలా తాజా నిబంధనలు ఉన్నాయని విమర్శిస్తున్నారు.

### దరఖాస్తుదారులపై ఒత్తిడి

వీసా పొందేందుకు ప్రస్తుతం దరఖాస్తుదారులు తమ విద్యార్హతలతో పాటు ఆర్థిక స్థితిగతులు, స్వదేశానికి తిరిగెళ్లాలన్న ఉద్దేశ్యాన్ని నిరూపించుకోవాలి. వీటికి సోషల్ మీడియా ప్రొఫైల్స్ కూడా తోడవడంతో దరఖాస్తుదారులపై మరింత ఒత్తిడి తప్పదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. డిజిటల్ నిఘా ఎక్కువ ఉన్న దేశాలు, సాంస్కృతిక కారణాలతో గోప్యత పాటించే దేశాల వారిపై తాజా నిబంధనల ప్రతికూల ప్రభావం ఎక్కువని చెబుతున్నారు.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369
39999

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గందరగోళం

## ఎమ్మెల్యే, స్థానిక నాయకులను నిలదీసిన అర్హులైన లబ్ధిదారులు

### స్వపక్షమే విపక్షం గా మారిన వైనం.. వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజుకు నిరసన సెగ



**హన్మకొండ మహా;** ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో నియోజకవర్గంలో గందరగోళం నెలకొంటున్నది. అర్హులైన లబ్ధిదారులకు కాకుండా తమ అనుకూలంగా అనుకున్న వారికి, పట్టణాల్లో స్థిరపడిన వారికే ఇళ్లు కేటాయిస్తూ జాబితాలు విడుదల చేయడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఎండ్లుగా సొంతింటి కలకు నోచుకోక కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన తమకు కనీసం ఈ విడత కాంగ్రెస్ సర్కార్ హయాంలోనైనా అదృష్టం వరించకబోతుందా.. అనుకున్న వారికి పలువురు ప్రజాప్రతినిధుల తీరుతో తీవ్ర నిరాశే ఎదురవుతున్నది. ప్రతిపక్ష పార్టీలు అన్నట్టుగా కేవలం అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర త్రా పెద్ద లీడర్ల కు సంబంధించిన వారికి ఇళ్లు కేటాయిస్తున్న వార్తలకు బలం చేకూరినట్టుగా కనిపిస్తోంది. సర్కార్ నుంచి ఎలాంటి అడ్డంకులు లేకున్నా కేవలం స్థానిక ఎమ్మెల్యేలు నెరుపు తున్న వ్యవహారంతో అటు ప్రభుత్వానికి చెడ్డపేరు రావడమే కాకుండా, ఇటు కాంగ్రెస్ పార్టీలోనే అంతర్గత కుమ్ములాటలకు తెరలు లేస్తున్నాయి.

**ఐనవోలు మండలంలో ఆందోళన**

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు సందర్భంగా ఐనవోలు మండలంలో గందరగోళం నెలకొంది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ఇండ్ల మంజూరు పత్రాల సందర్భంగా టెన్షన్ వాతావరణం నెలకొంది. కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన తుళ్ల రజితకు పత్రాలు రాకపోవడంతో ఆవేదనకు గురయ్యారు. బతుకు దెరువు కోసం హైదరాబా దులో ఉంటున్నారని, ఊర్లో ఉండడం లేదని పలువురు నాయకులు అధికారులకు చెప్పి పేరు తొలగించారని తీవ్రంగా కంటతడి పెట్టింది. ఇందిరమ్మ రాజ్యం అంటే అర్హురాలైన మహిళకు కాకుండా, ఇష్టారీతిగా కేటాయింపులు చేయడమేనా అని ఆవేదన వ్యక్తంచేశారు. కంటతడి పెట్టించడమే సర్కార్ లక్ష్యమా అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే స్థానిక నాయకులు, జిల్లా నాయకులను నిలదీశారు. పలువురు మండల వాసులు కూడా నాయకుల పై తీవ్రంగా మండిపడ్డారు. స్వయంగా ఎమ్మెల్యే నాగరాజు సమక్షంలోనే రచ్చరచ్చ జరిగింది. కాంగ్రెస్ శ్రేణులే ప్రజాప్రతినిధులను నిలదీయడం చర్చనీయాంశం అయ్యింది. అర్హులకు కాకుండా సొంత మను షులకు కేటాయింపులు చేస్తే పార్టీతో పాటు ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు మూటగట్టుకోవాల్సి దుస్థితి నెలకుంటుందని నాయ కులపై మండిపడ్డారు. ఇండ్లు ఉన్నవారికే కేటాయిస్తూ గత ప్రభుత్వం లాగానే పథకాన్ని నీరుగారుస్తున్నారని ఆరోపించారు.

**వయస్సు పరిమితి తో కొత్త తంటా**

సాధారణంగా ఇండ్లు లేని వారు ఏ వయస్సు వారైనా ఉండొచ్చు కానీ, కాంగ్రెస్ సర్కార్ అట్టహాసంగా ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఏజ్ లిమిట్ తో ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారి తీసింది. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుపై హస్తం శ్రేణుల ఆగ్రహం.. అర్హులను పక్కబెట్టడం పై అసహనం.. ఎమ్మెల్యే అనుచరులు, అనర్హులకు కేటాయించడంపై విమర్శలు.. కేఆర్ నాగరాజుకు నిరసన సెగ.. లబ్ధిదారుల ఎంపికై నిలదీసిన పలువురు కాంగ్రెస్ నేతలు.. మంత్రి స్వయానా ఏజ్ లిమిట్ లేదని, అన్ని వయస్సుల వారికి అర్హత ప్రకారం కేటాయింపులు జరుగుతాయని ప్రకటించగా, స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు మాత్రం 60 ఏండ్లు దాటిన వారికి ఇండ్ల కేటాయింపులు ఉండవని పేర్కొనడంతో పండు ముసలి వారు, తోడు లేని వారు, సంతానం ఎక్కడెక్కడో స్థిరపడిన వారు తీవ్ర అన్యాయానికి గురవుతున్నామని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికైనా మంత్రులు చెప్పినట్టుగా అర్హత కలిగిన వారందరికి వయస్సుతో సంబంధం లేకుండా ఇండ్ల మంజూరు చేయాలని అర్హులైన లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలి




**వరంగల్ మహా;** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్, మార్కెటింగ్ శాఖ సంచాలకులు, సహకార శాఖ రిజిస్ట్రార్ కె. సురేంద్రమోహన్ అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీసీపీ ప్రభాకర్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై సమీక్షించి సమర్థ నిర్వహణకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రవాణా శాఖ కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఏ ఒక్కరు వైకల్యం బారిన పడకుండా ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా రహదారి ప్రమాదాలు సంభవించకుండా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఒకే ప్రాంతంలో ఐదు ప్రమాదాలు జరిగితే ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్లుగా గుర్తించి ఆయా ప్రాంతాలలో ప్రమాదాలు నివారించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రమాణాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ప్రతిరోజు 70 ప్రమాదాలు 20 మరణాలు సంభవిస్తున్నాయని, దేశంలో మన రాష్ట్రం ఐదో స్థానంలో ఉందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టడం జరిగిందని తెలిపారు. రోడ్డు భద్రతపై పాఠశాలలు కళాశాలలు యూనివర్సిటీలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యాసంస్థల్లో ఎన్సిసి వలె రోడ్ సేఫ్టీ క్లబ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ లో ఏర్పాటు చేయాలని, కొత్తగా నిర్మించదున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్లో కూడా ఇది తప్పనిసరిగా ఉండేలా చూడాలని రవాణా శాఖ, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మాదిరిగా ఎలక్ట్రానిక్ ఎన్ఫోర్స్మెంట్ సిస్టం అమలు చేస్తూ ఏ ఎన్ పి ఆర్ కెమెరాల కొత్త సాఫ్ట్వేర్ ద్వారా వాహన నంబర్ ఆధారంగా వాహనం యొక్క పూర్తి వివరాలు సేకరించాలని అలాగే ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టం ఏర్పాటుకు వెంటనే భూ సేకరించాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రతి నెల సమీక్షలు నిర్వహిస్తూ ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 70 ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, అందులో 60 జాతీయ రహదారి, 10 ఇతర రోడ్డులు గా గుర్తించి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల అవగాహన కల్పించుట జిల్లాలో తొమ్మిది కళాశాలల్లో రోడ్ సేఫ్టీ అవేర్నెస్ క్లబ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డీసీపీ ప్రభాకర్ మాట్లాడుతూ 246 ఏఎన్ పిఆర్ (ఆటోమేటిక్ నేమ్ ప్లేట్ రికగ్నైజేషన్)కెమెరాలను అమర్చి నిత్యం పర్యవేక్షిస్తూ ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు ప్రమాదాలు జరగకుండా, ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా,పట్టణంలో రహదారికి ఇరువైపులా ఆక్రమణలను తొలగించడం జరుగుతున్నదనిఅన్నారు. అంతకుముందు రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ ను కలెక్టర్ డాక్టర్ సత్య శారద శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశంలో జిల్లాల రవాణా శాఖ అధికారులు పురుషోత్తం, శోభన్ బాబు, జిల్లా ఆర్ అండ్ బి అధికారి రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఎన్హెచ్ఎఐ టీం లీడర్ సంపత్ సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం

## పాల్గొన్న ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్



**వరంగల్ మహా;** మామునూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హెచ్ఆర్ఎస్ ఫంక్షన్ హాల్లో వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ఐపీఎస్ ఆధ్వర్యంలో సీపీ వరంగల్ సంప్రిత్ సింగ్ అదేశాల మేరకు ఈస్ట్ జోన్ పరిధిలోని మామునూర్, పరకాల, నర్సంపేట సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ల కు చెందిన ఆయా ప్రాంతాలలోని అన్ని మతాల మత పెద్దల తో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మత పెద్దలు, పోలీసు అధికారులు, గ్రామస్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు. రాబోయే బక్రీద్ పండుగను శాంతియుతంగా, మతసామరస్యంగా జరుపుకోవాలని డీసీపీ సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు పోలీసులకు పూర్తిగా సహకరించాలని సూచించారు. అంతేకాకుండా Prevention of Cruelty to Animals Act 1960, TS Prohibition of Cow Slaughter & Animal Preservation Act 1978 ప్రకారం ఉన్న నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఎవరి వద్దైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రార్థనాలయాలు, గుడులు, మసీదులు, చర్చ్ లు, అన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అలాగే గ్రామాల్లో ఇటీవల దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి గ్రామస్థాయి ప్రజలు తమ స్థాయిలో భద్రత చర్యలలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీటితో పాటు, గ్రామ ప్రజలు తమ ఇళ్లలో లేనప్పుడు లేదా బంధువుల ఇళ్లకు వెళ్లిన సందర్భాల్లో పక్కింటి వారికి స్థానిక పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా సూచించారు.

# పేద కుటుంబానికి అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

- సొంతింటి కలల సాధం ఇందిరమ్మ రాజ్యంలోనే సాధ్యం
- పేద కుటుంబానికి ఆత్మగౌరవ ప్రతీకగా ఇందిరమ్మ ఇల్లు
- 336 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే నాగరాజు, ఛైర్మన్ మార్నేని



**హన్మకొండ మహా;** పేద ప్రజల జీవితాల్లో నేడు అసలైన పండుగ వాతావరణం కనిపిస్తుందని, ఇంతి కలల సౌధం ఇందిరమ్మ రాజ్యంలోనే సాధ్యం అయ్యిందని గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం రోజున కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా వర్ధన్నపేట నియోజవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేసిన క్రమంలో నేడు టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు తో కలిసి 336 మంది లబ్ధిదారులకు ఐనవోలు మండల కేంద్రం లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే నాగరాజు అందజేశారు. తొలుత ఎమ్మెల్యే నాగరాజు కు ఐనవోలు మండల నాయకులు కార్యకర్తలు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం మండల పరిధిలోని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ 5 మంది లబ్ధిదారులక ఎమ్మెల్యే నాగరాజు చెక్కులను పంపిణీ చేయడం తో పాటు మండలం లోని రైతులకు కలెక్టర్ తో కలిసి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రజా ప్రభుత్వంలో మేము పాలకులము కాదని సేవకులమని నా గెలుపు లో భాగస్వాములైన ప్రజలను, నాయకులను కాపాడుకునే బాధ్యత తనదేనని అన్నారు. అలాగే నా నియోజకవర్గ ప్రజలు ఏ సమస్య ఉన్న డయల్ యువర్ ఎమ్మెల్యే 8096107107 కి ఫోన్ చేసి మీ సమస్య తెలియజేస్తే త్వరితగతన మీ సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు అధికారులు,పార్టీ నాయకులు,లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# స్పైస్ జెట్ విమానం రద్దు

## శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన



**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తిరుపతి వెళ్లాల్సిన స్పైస్జెట్ విమానాన్ని అధికారులు రద్దు చేశారు. తిరుపతి వెళ్లవలసిన 35 మంది ప్రయాణికులుశంషాబాద్ ఎయిర్పోర్టులో ధర్నాకు దిగారు. ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా స్పైస్ జెట్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఏర్పాటు అధికారులపై చిందులు వేశారు. తిరుపతి వెళ్లవలసిన 35 మంది ప్రయాణికులు ఏర్పాట్లు ఆందోళన చేపట్టారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, కమిషనర్



**హన్మకొండ మహా;** బల్దియా పరిధి 53వ డివిజన్ లోని మహాత్మనగర్ ప్రాంతం లో కార్పొరేషన్ సాధారణ నిధులు రూ.30 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న సి సి రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులు, హన్మంతరావు నగర్ లో బల్దియా జనరల్ ఫండ్ నిధులు రూ.15 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న సి సి రోడ్డు నిర్మాణ పనులతో పాటు 54 వ డివిజన్ పరిధి లోని సగర కాలనీ లో రూ.33 లక్షల అంచనా వ్యయం తో నిర్మించనున్న సి సి రోడ్డు నిర్మాణ పనులకు బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే తో కలిసి శంఖుస్థాపన చేసిన స్థానిక వరంగల్ (పశ్చిమ)శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి .... వంద రోజుల కార్యక్రమం లో భాగం గా 53 వ డివిజన్ లో క్షేత్ర స్థాయిలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించుటకు అధికారులకు తగు సూచనలు చేసి అనంతరం నిర్వహించిన స్వచ్ఛ ప్రతిజ్ఞ లో శాసన సభ్యులు, కమిషనర్, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు గుంటి రజిత శ్రీనివాస్, సోదా కిరణ్, సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ రెండవ విడత రిజిస్ట్రేషన్లు ప్రారంభం

**రంగారెడ్డి జిల్లా మహా:** డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) 202526 విద్యా సంవత్సరానికి డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరంలో విద్యార్థులు చేరుటకు రెండవ విడత ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాధిక తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాలకు ఆప్షన్ ఇవ్వాలని కోరారు.ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసి ఇబ్రహీంపట్నం కళాశాలకు కేటాయించబడిన విద్యార్థులు ఆన్లైన్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోగలరు. ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగుతున్న ఈ కళాశాలలో బిఏ, బీకాం, బీఎస్సీ (లైఫ్ సైన్సెస్, డెయిరీ సైన్స్ మరియు క్రాప్ ప్రొడక్షన్), బిఎస్సి (ఫిజికల్ సైన్సెస్), లాంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. పిహెచ్.డి, నెట్, సెట్ మొదలైన అత్యున్నత విద్యార్హత కలిగిన అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన జరుగుతోందని, ఎన్ఎస్ఎస్, కెరీర్ గైడెన్స్, పీజీ ఎంట్రన్స్ కోచింగ్ మొదలైన శిక్షణ తరగతులు నిర్వహించబడతాయని తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు ఆన్లైన్లో రూ. 400 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆప్షన్లు ఈనెల 9 వరకు ఇచ్చేందుకు అవకాశం ఉందన్నారు. వివరాలకు చరవాణి నంబర్లు 9441705076, 938106920లలో సంప్రదించాలని సూచించారు.


## పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన

# అమలుకు సహకరించండి

## ఏంఎన్ఆర్ఈ జాయింట్ సెక్రటరీ జేవిఎన్ సుబ్రమణ్యం

### దేశవ్యాప్తంగా పలు నగరాల కలెక్టర్లు, కమిషనర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ.... వరంగల్ నుండి హాజరైన కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే







**వరంగల్ మహా:** పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలుకు సహకరించాలని ఏంఎన్ఆర్ఈ జాయింట్ సెక్రటరీ జేవిఎన్ సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం దేశ వ్యాప్తంగా ఎంపిక చేయబడిన 65 నగరాల కలెక్టర్లు, కమిషనర్ లతో ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన (పి ఎం ఎస్ జీ ఏం బి వై) అమలు రాష్ట్రాల వారి పని తీరు పై కేంద్ర నూతన పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ లో నగరం నుండి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఏంఎన్ఆర్ఈ జాయింట్ సెక్రటరీ పథకం అమలును వేగవంతం చేయడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై మున్సిపల్ కమిషనర్లతో చర్చించారు. 202627 ఆర్థిక సంవత్సరం నాటికి రూఫ్టాప్ సోలార్ ఇన్స్టాలేషన్ల ద్వారా ఒక కోటి గృహాలు సొంత విద్యుత్తును ఉత్పత్తి చేసుకునేలా సాధికారత కల్పించడం లక్ష్యం గా నిర్ణయించడం జరిగిందని, అందుకు అనుగుణంగా ఆయా రాష్ట్రాల ఏం డి లు, జిల్లాల కలెక్టర్లు కమిషనర్ లు సంపూర్ణ సహకారం అందించాలని, ఈ పథకాన్ని అట్టడుగు స్థాయికి తీసుకెళ్ళి విజయవంతం చేయడంలో అధికారులు సమన్వయం తో పనిచేయాలని, రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలు, జిల్లాల మధ్య ఆన్గ్రౌండ్ అమలును మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఈ ఈ మహేందర్, ఐటి మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.



## గోవిందరాజుల స్వామి దేవస్థాన అభివృద్ధికై పరిశీలించిన అధికారులు

**వరంగల్ మహా;** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచనల మేరకు ఆలయ కార్యనిర్వాహణాధికారి మిట్టపల్లి భాస్కర్ స్థానిక కార్పొరేటర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఓరుగల్లులో చారిత్రాత్మకమైన శ్రీ గోవిందరాజుల స్వామి గుట్ట దేవస్థానం అభివృద్ధికై తెలంగాణ రాష్ట్ర ధార్మిక ముఖ్య సలహాదారు గోవిందా హరి, స్థపతి వల్ల నయాగామ్, ఎస్ఈ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ స్థపతి గణేష్, తో కలిసి వర్క్ ఇన్స్పెక్టర్ సునీల్, ఆలయ అభివృద్ధి కొరకై దేవాలయ పరిసరాలను పునః పరిశీలన చేశారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు గూడ శారద , నాగరాజు, ఎక్స్ అఫీషియస్ సభ్యులు వరయోగుల లక్ష్మణా స్వామి , అర్చకులు వరయోగుల ప్రసాద్ స్వామి, మురళి స్వామి ,రాముస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు సరఫరా చేస్తున్న ముఠా అరెస్ట్



**రాజేంద్రనగర్, మహా:** విదేశాల్లో విద్యాభ్యాసం కోసం నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ సరఫరా చేస్తున్న కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్, నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు పొందిన నిందితులను ఎయిర్పోర్ట్ పోలీసులు అరెస్టు చేశారు. శంషాబాద్ ఏసిపి కార్యాలయంలో ఏసిపి శ్రీకాంత్ గౌడ్ మీడియా సమావేశం మంగళవారం నిర్వహించి మీడియాకు తెలిపిన వివరాలు... ధనలక్ష్మి ఓవర్సీస్ అబ్రాడ్ స్టడీ ఇన్ వీసా కన్సల్టెన్సీ, టీచర్స్ కాలనీ బి.ఎన్.రెడ్డి నగర్ హైదరాబాదులో గత ఐదు సంవత్సరాల నుంచి కన్సల్టెన్సీ కొనసాగిస్తున్నాడు. 2021 సంవత్సరంలో కేరళకు చెందిన నకిలీ డిగ్రీ సర్టిఫికెట్స్ తయారుచేసి పంపించే వ్యక్తి తో పరిచయం ఏర్పడింది. విదేశాలలో చదవాలని కోరిక ఉండి, అకడమీక్ లో బలహీనంగా ఉన్న తన కన్సల్టెన్సీ కి వచ్చే విద్యార్థులకు ఒకరికి 80000 వేల నుండి, లక్ష వరకు డబ్బులు తీసుకుని అందులో 30 వేల రూపాయలు నకిలీ సర్టిఫికెట్ సరఫరా చేస్తున్న కేరళ వ్యక్తికి ఇచ్చేవాడు. కేరళ వ్యక్తి నకిలీ ఎక్స్పీరియన్స్ సర్టిఫికెట్స్, బ్యాంక్ స్టేట్మెంట్స్ తయారుచేసి విదేశాలకు పంపుతున్నాడు. అందులో భాగంగానే ఆగస్టు 2021లో కాతోజు అశోక్ 80000 తీసుకొని తమిళనాడుకు చెందిన మధురై కామరాజ్ యూనివర్సిటీ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ఫేక్ డిగ్రీ సర్టిఫికెట్లను 2015 2018 పూర్తయినట్లు ఇచ్చి నదు. దాని సహకారంతో పకీరు గోపాల్ రెడ్డి అమెరికా వెబ్సైట్ యూనివర్సిటీలో అడ్మిషన్ వచ్చింది. రెండు సంవత్సరాలకు కాలేజీ ఫీజు 28, వేల డాలర్స్, ఇండియన్ రూపాయల సుమా 22 లక్షలు, పదిహేను నెలల పాటు చదువుకున్నాడు. అతను ఐదు నెలల కిందట మళ్లీ ఇండియాకు వచ్చి తిరుగు ప్రయాణంలో డల్లాస్ ఏర్పోర్ట్ ఇమ్మిగ్రేషన్ ప్రాసెస్ లో అధికారులు సంబంధిత వైఫ్ సైట్లు అతను స్టేటస్ ఇన్ క్టివ్ గా ఉండడంతో డల్లాస్ నుంచి అధికారులు బహిష్కరించారు. అతను తిరిగి హైదరాబాద్ ఎయిర్పోర్ట్ కు రావడంతో ఇమ్మిగ్రేషన్ అధికారులు విచారించి నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ వల్లనే A ( 2 ) స్టూడెంట్ వీసా పొందినట్లు నిర్ణయించారు. 2020 నుంచి ఇప్పటివరకు దాదాపుగా 15 మంది విద్యార్థులను విదేశాలకు పంపించినట్లు పోలీసుల విచారణ తేలింది. మధురై కామరాజ్ యూనివర్సిటీ కి సంబంధించిన 13 వ్యక్తుల పేర్లతో కలిగి ఉన్న నకిలీ మార్కుల ధృవ పత్రాలను, ఉస్మానియా యూనివర్సిటీ కి సంబంధించిన నలుగురు వ్యక్తుల పేర్లతో కలిగి ఉన్న మొత్తం 121 నకిలీ దువా పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 7 నకిలీ స్టాంపులు, ఫెడరల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మూడు ఖాతా పాసుబుక్కులు. మూడు లాప్టాప్ లు, నగదు పది లక్షల రూపాయలు. నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

# చోరీలపై ప్రత్యేక ఫోకస్ పెట్టండి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




**హన్మకొండ మహా;** వరంగల్ కమిషనరేట్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీల నియంత్రణ పై ప్రతి పోలీస్ అధికారి ప్రత్యేక దృష్టి సారించాలని వరంగల్ కమిషనర్ అధికారులకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా ఆస్తి నేరాల పై సమీక్ష జరిపారు. ఇందులో ప్రధానంగా పెండింగ్ చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్, సోమ్ము రికవరీ, పెండింగ్ లో వున్న చోరీ కేసులు, నిందితుల అరెస్ట్ పై సీపీ సమీక్ష జరపడం తో పాటు, సుధీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న ఇతర కేసులపై సమీక్ష జరిపడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోని, కేసుల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణ కై సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రజలను భాగస్వాములను చేయడం వల్ల సిసి కెమెరాల ప్రాధాన్యత పై ప్రజలకు అవగాహన కల్పించాలని, నేరాలకు సంబంధించి అధికారులు దర్యాప్తు సమయం లో టెక్నాలజీ తో పాటు శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేపట్టాలని, చోరీల పై పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యంగా వాహనాల చోరీలకు సంబంధించి వాహనాలను ఇంటి లోపల పార్కింగ్ చేసుకోనే విధంగా ప్రజలకు సూచించాలని సీపీ తెలిపారు. అలాగే రాబోవు బక్రీద్ పండుగను దృష్టి లో పెట్టుకొని మూగజీవాల రవాణా పై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు, పండుగ వేళ దర్గాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్ట్ ఏర్పాటు చేయాలని వరంగల్ కు వున్న కీర్తి ప్రతిష్టలకు తగ్గట్లుగా పోలీసింగ్ ఉండాలని సూచించారు. ప్రతి పోలీస్ బేసిక్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా,రాజ మహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, జనగాం ఏఎస్పీ చైతన్య, అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గోన్నారు.

# పాకిస్థాన్ బడ్జెట్ వాయిదా




రాబోయే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టే బడ్జెట్‌లో పాకిస్థాన్ రక్షణ వ్యయానికి చేసే కేటాయింపులపై అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి ఆందోళనలు రేకెత్తాయి. అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వడం కంటే సైనిక చర్యలకు నిధులు కేటాయించడంపై ఐఎంఎఫ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ అభ్యంతరాలు తీవ్రం అవుతున్న నేపథ్యంలో జూన్ 2న విడుదల చేయనున్న పాకిస్థాన్ బడ్జెట్‌ను జూన్ 10కి వాయిదా వేశారు. పాక్ ప్రతిపాదిత బడ్జెట్‌లో రక్షణ వ్యయాన్ని 18% పెంచాలని నిర్ణయం తీసుకుంది. దీన్ని దేశ ఆర్థిక రికవరీని పర్యవేక్షిస్తున్న అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అధిక ద్రవ్యోల్బణం (38% కంటే ఎక్కువ), పెరుగుతున్న రుణ భారం, 25 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటుతో పాక్ పోరాడుతున్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాల కంటే సైనిక నిధులకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని ఐఎంఎఫ్ అభిప్రాయపడుతోంది. ఇటీవల ఒక బిలియన్ డాలర్ల అప్పును ఐఎంఎఫ్ పాకిస్థాన్‌కు ఆమోదించిన విషయం తెలిసిందే.

### బడ్జెట్ వాయిదా

రక్షణ కేటాయింపులు, పన్ను కోతలకు సంబంధించి ఐఎంఎఫ్‌తో విభేదాలు తలెత్తడంతో జూన్ 2న విడుదల కావాల్సిన బడ్జెట్‌ను పాకిస్థాన్ జూన్ 10కి వాయిదా వేసింది. ఇప్పటికే బలహీనంగా ఉన్న ఆర్థిక వ్యవస్థపై మరింత ఒత్తిడిని నివారించేలా చర్యలు తీసుకోవాలని ఐఎంఎఫ్ సూచించింది. సైనిక వ్యయాన్ని భర్తీ చేయడానికి ప్రత్యామ్నాయ ఆదాయ వనరులను గుర్తించాలని ఐఎంఎఫ్ పాకిస్థాన్‌కు తెలిపింది.

### అభివృద్ధి కార్యక్రమాలకు కోతలు

పాకిస్థాన్ ప్రతిపాదిత బడ్జెట్ సవరణలో అభివృద్ధికి అత్యంత కీలకంగా ఉన్న పబ్లిక్ సెక్టార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (పీఎస్‌డీపీ)కి కేటాయింపులను గతంలో కంటే 20% తగ్గించారు. ఈ తగ్గింపు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలను ప్రభావితం చేస్తుంది. దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వానికి దోహదపడే రంగాల్లో వృద్ధి అవకాశాలను పరిమితం చేస్తుంది.

### పెరుగుతున్న రుణ, ఆర్థిక సవాళ్లు

పాకిస్థాన్ రుణజీడీపీ నిష్పత్తి 70%గా ఉంది. ఇది దేశం ఆర్థిక సౌలభ్యం, అత్యవసర సేవలకు నిధులు సమకూర్చే వెసులుబాటును పరిమితం చేస్తుంది. పెరుగుతున్న వాణిజ్య లోటు నిర్వహణను మరింత క్లిష్టతరం చేస్తుంది. ఆర్థిక పునరుద్ధరణకు తక్కువ మార్గాలను చూపుతుంది.

### గతంలో కంటే బడ్జెట్‌లో భారీగా కోతలు ఎదుర్కొంటున్న ఇతర రంగాలు..

- మౌలిక సదుపాయాలు: రూ.644 బిలియన్లు (రూ.661 బిలియన్ల నుంచి తగ్గుదల)
- ఎనర్జీ: రూ.144 బిలియన్లు (రూ.169 బిలియన్ల నుంచి తగ్గుదల)
- నీటి నిర్వహణ: రూ.109 బిలియన్లు (రూ .135 బిలియన్ల నుండి తగ్గింది)
- హౌసింగ్ అండ్ ఫిజికల్ ప్లానింగ్: రూ.59 బిలియన్లు (రూ.89 బిలియన్ల నుంచి 34 శాతం క్షీణత)
- సోషల్ సెక్టార్లు: రూ.150 బిలియన్లు (రూ.200 బిలియన్ల నుంచి 25% తగ్గుదల)
- సైన్స్ అండ్ టెక్నాలజీ: రూ.53 బిలియన్లు (రూ.62 బిలియన్ల నుంచి తగ్గుదల)
- గవర్నెన్స్ ప్రాజెక్టులు: రూ.9 బిలియన్లు (రూ.17 బిలియన్ల నుంచి తగ్గుదల)
- ఉత్పత్తి రంగాలు: రూ .11 బిలియన్లు

# రిజిస్ట్రేషన్ బిల్లు 2025 ముసాయిదా విడుదల


దేశవ్యాప్తంగా ప్రాపర్టీ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లను ఆధునీకరించేందుకు ఉద్దేశించిన రిజిస్ట్రేషన్ బిల్లు 2025 ముసాయిదాను కేంద్రం ఆవిష్కరించింది. ఈ ప్రతిపాదిత చట్టం సమకాలీన డిమాండ్లకు సరిపోని నాటి 1908 రిజిస్ట్రేషన్ చట్టాన్ని భర్తీ చేయడానికి ఏర్పాటు చేశారు. కొత్త బిల్లు ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ వ్యవస్థకు మద్దతుగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. తద్వారా బ్యూరోక్రసీ, మధ్యవర్తుల అవసరం తగ్గనుంది. ప్రాపర్టీ డాక్యుమెంటేషన్‌పై ఆధారపడిన ఆర్థిక లావాదేవీలు, చట్టపరమైన నిర్ణయాలు, పరిపాలనా సేవలను క్రమబద్ధీకరించే విస్తృత ప్రయత్నంలో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. భూ దందాల్లోనే కాకుండా వివిధ ఆర్థిక, చట్టపరమైన కార్యకలాపాల్లో కూడా ప్రాపర్టీ డాక్యుమెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నందున ఈ మార్పులు ప్రాధాన్యత చోటుచేసుకుంటున్నాయి. 1908 రిజిస్ట్రేషన్ చట్టం ఆన్‌లైన్ డాక్యుమెంట్ నిర్వహణ, డిజిటల్ ఐడెంటిటీ వెరిఫికేషన్ వంటి ఆధునిక అవసరాలకు అనుగుణంగా రూపొందించబడలేదు. ఈ వెసులుబాట్లు టెక్నాలజీ పెరుగుతున్న ఈ రోజుల్లో అత్యవసరంగా మారాయి. ప్రాపర్టీ డాక్యుమెంట్లు ఇప్పుడు కేవలం భూ దందాలకు మాత్రమే కాకుండా వివిధ ఆర్థిక, చట్టపరమైన కార్యకలాపాలకు కీలకంగా మారుతున్నాయి. అనేక రాష్ట్రాలు ఇప్పటికే ఆన్‌లైన్ అప్‌లోడ‌్‌లు, ఆధార్ ఆధారిత ధ్రువీకరణను అమలు చేస్తున్నాయి. అందుకు అనుగుణంగా దేశం అంతటా స్థిరమైన, విశ్వసనీయమైన వ్యవస్థను స్థాపించడానికి కొత్త చట్టం అవసరమని భావిస్తున్నారు. ఈ ఏకరూపత పౌరులందరికీ సమర్థవంతమైన, సురక్షితమైన ఆస్తి రిజిస్ట్రేషన్ ప్రక్రియలకు అవకాశం కల్పిస్తుందని భావిస్తున్నారు.



### ప్రతిపాదిత అంశాలు..

- గృహ కొనుగోలుదారులకు ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత అందుబాటులోకి తీసుకురావడం, సమర్థవంతంగా నిర్వహించడం కొత్త బిల్లులోని ప్రధానాంశాల్లో ఒకటి. ప్రతిపాదిత విధానంలో పౌరులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పదేపదే వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆస్తి పత్రాలను డిజిటల్‌గా నమోదు చేసుకోవచ్చు.
- ఆన్‌లైన్ ద్వారా పేపర్ వర్క్ తగ్గుతుందని, ప్రక్రియలను వేగవంతం చేస్తుందని, మధ్యవర్తులపై ఆధారపడటాన్ని పరిమితం చేస్తుందని భావిస్తున్నారు.
- ఆస్తుల లావాదేవీలకు డిజిటల్ రికార్డులను తప్పనిసరి చేయడం ద్వారా చట్టపరమైన రక్షణ పెరుగుతుంది. ఈ చర్యతో అమ్మకం ఒప్పందాలు, తనఖా పత్రాలు, సేల్ సర్టిఫికేట్లు వంటి కీలక డాక్యుమెంట్ల చట్టబద్ధత మెరుగుపడుతుందని భావిస్తున్నారు.
- డిజిటల్‌ఫస్ట్ విధానాన్ని అవలంబించడం ద్వారా, ఆస్తి లావాదేవీలను మరింత పారదర్శకంగా, సురక్షితంగా చేయడమే ఈ బిల్లు లక్ష్యం.

## 15 రోజుల్లో వంట నూనెల ధరలు తగ్గింపు



ముడి వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని 10 శాతం తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే రెండు వారాల్లో రిటైల్ స్థాయిలో వంట నూనెల ధరలు 56 శాతం తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇటీవలి కాలంలో దాదాపు 17 శాతం పెరిగిన వంట నూనె ధరలు ఎట్టకేలకు దిగివచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. త్వరలోనే ఇది సింగిల్ డిజిట్‌కు చేరుకుంటుందని భావిస్తున్నట్లు ఇమామి అగ్రోటెక్ డైరెక్టర్, సీఈవో సుధాకర్ రావు దేశాయ్ తెలిపారు. తగ్గిన సుంకాల వల్ల కలిగే ప్రయోజనం మరో 15 రోజుల్లో రిటైల్ ధరల్లో ప్రతిఫలిస్తుందని భావిస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్లు ఇప్పటికే ధరలు తగ్గుముఖం పట్టే సంకేతాలను చూపిస్తున్నాయని మార్కెట్ వర్గాలు తెలియజేస్తున్నాయి. ధరల దిద్దుబాటు కేవలం దిగుమతి చేసుకునే నూనెలకే పరిమితం కాదని దేశాయ్ తెలిపారు. దిగుమతులపై ఆధారపడని ఆవనూనె కూడా వంటనూనెలపై కూడా 34 శాతం తగ్గుదలను చూడవచ్చని అన్నారు. ముడి వంట నూనె, రిఫైన్డ్ ఆయిల్ సుంకాల మధ్య వ్యత్యాసం 12.5 శాతం నుంచి 22.5 శాతానికి పెరగడం వల్ల కంపెనీలు ముడినూనెను దిగుమతి చేసుకుని దేశీయంగా శుద్ధి చేయడం చాలా ఖర్చుతో కూడుకుంది. అయితే తాజాగా 10 శాతం సుంకం తగ్గింపు నిర్ణయం ఈ విభాగంలోని వ్యాపారాలకు బూస్ట్‌గా నిలుస్తుందని హల్దర్ వెంచర్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కేశవ్ కుమార్ హల్దర్ అన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో సోయాబీన్, పొద్దుతిరుగుడు, పామాయిల్ వంటి దిగుమతి చేసుకున్న వంట నూనెల దేశీయ రిటైల్ ధరలు క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. దేశీయంగా ఉత్పత్తి అయ్యే రైస్ బ్రాన్, ఆవనూనె వంటి నూనెలకు కూడా ఈ తగ్గుదల వర్తించే అవకాశం ఉంది అని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.




# వచ్చే ఐదేళ్లలో 50 ఎయిర్‌పోర్ట్‌లు ఏర్పాటు

దేశవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 50 కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేసి మొత్తం ఎయిర్‌పోర్ట్‌ల సంఖ్యను 212కు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం (ఐఏటీఏ) వార్షిక సమావేశంలో ఈమేరకు కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ప్రకటన చేశారు. ఈ విస్తరణలో ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకం కీలకంగా వ్యవహరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. దేశం అంతటా ప్రజలకు మరింత చౌకగా, అందుబాటు ప్రాంతాల్లో విమానప్రయాణం చేసేలా ఉడాన్ పథకం సంస్కరణలు తీసుకొస్తోంది. ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి 619 కొత్త మార్గాలను నెట్‌వర్క్‌లో జోడించింది. ఇది చిన్న పట్టణాలు, నగరాలకు ప్రత్యక్ష విమాన కనెక్టివిటీని పొందేందుకు దోహదపడుతుంది. విమానాశ్రయాల సంఖ్యను విస్తరించడంపై ప్రభుత్వం దృష్టి సారించడంతోనే ఇది సాధ్యమవుతుందని మంత్రి చెప్పారు. ప్యాసింజర్ కనెక్టివిటీకి మించి భారత్ గ్లోబల్ మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్హాల్ (ఎంఆర్ఓ) హబ్‌గా కూడా నిలదొక్కుకుంటోంది. 2031 నాటికి ఎంఆర్ఓ విభాగం 4 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. దేశీయ, అంతర్జాతీయ విమానాల నిర్వహణ అవసరాలను తీర్చే ప్రపంచ స్థాయి సౌకర్యాలను సృష్టించే దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ మార్పు విదేశీ మరమ్మతు సేవలపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గిస్తుంది.



## సినిమా వార్తలు | MOVIE NEWS





# నేను తప్పు మాట్లాడలేదు.. కమల్ హాసన్ లేఖ

ప్రస్తుతం కమల్ హాసన్, కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ మధ్య చిన్నపాటి వివాదం నడుస్తోంది. కొన్నిరోజుల క్రితం 'థగ్ లైఫ్' ఈవెంట్‌లో మాట్లాడుతూ.. కన్నడ భాష తమిళం నుంచి పుట్టిందని కమల్ కామెంట్ చేశాడు. దీనిపై కర్ణాటక అధికార, విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. సినిమాని తమ దగ్గర నిషేధిస్తున్నట్లు స్వయంగా కన్నడ ఫిల్మ్ ఛాంబర్ ప్రకటన చేసింది. ఇప్పుడు ఈ విషయమై కమల్ లేఖ విడుదల చేశారు. కన్నడ సూపర్‌స్టార్ రాజ్ కుమార్ కుటుంబంతో ఉన్న అనుబంధం గురించి మాట్లాడిన కమల్.. 'కన్నడ భాషపై చేసిన వ్యాఖ్యల్ని అక్కడి వారు అపార్థం చేసుకోవడం బాధగా ఉంది. మనదంతా ఒకే కుటుంబం అని చెప్పడమే తన ఉద్దేశమని, ఆ భాషని తక్కువ చేయడం కాదు' అని కమల్ చెప్పారు. ఈ మేరకు కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ప్రెసిడెంట్ నరసింహులుకు లేఖ రాశారు. కర్ణాటకలో 'థగ్ లైఫ్' నిషేధించాలని ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయం తీసుకోవడంతో కమల్ హాసన్.. కర్ణాటక హైకోర్టుని ఆశ్రయించారు. న్యాయస్థానం కూడా కమల్‌కి చివాట్లు పెట్టింది. మీరేమైనా చరిత్రకారులు అనుకుంటున్నారా? ఏ ఆధారంతో ఈ కామెంట్స్ చేశారు, సారీ చెబితే సరిపోతుంది కదా అని తీర్పు ఇచ్చింది. అయినా సరే కమల్ వెనక్కి తగ్గలేదు. క్షమాపణ చెప్పలేదు సరికదా.. కర్ణాటకలో 'థగ్ లైఫ్' రిలీజ్ చేయట్లేదని తన లేఖలో పేర్కొన్నారు.


1 of 2

Kamal Haasan

3/6/2025

Mr. Narasimhalu,

President,

Karnataka Film Chamber of Commerce, Bangalore.

Sir,

I acknowledge your letter dated 30/05/2025. Out of deep respect for the people of Karnataka, I offer the following with sincerity.

It pains me that my statement at the Thug Life audio launch — spoken out of genuine affection for the legendary Dr. Rajkumar's family, especially Shiva Rajkumar — has been misunderstood and taken out of context. My words were intended only to convey that we are all one and from the same family and not to diminish Kannada in any way. There is no dispute or debate on the rich legacy of Kannada language.

Like Tamil, Kannada has a proud literary and cultural tradition that I have long admired. Throughout my career, I have cherished the warmth and affection extended to me by the Kannada-speaking community, and I say this with a clear conscience and conviction: my love for the language is genuine, and I have great respect for the love that Kannadigas have for their mother tongue.

My bond with Tamil, Kannada, Telugu, Malayalam — and all languages of this land — is abiding and heartfelt. I have always stood for the equal dignity of all Indian languages and remain opposed to the dominance of any one language over another, as such imbalance undermines the linguistic fabric of the Union of India.


I know and speak the language of Cinema. Cinema is a universal language that knows only love and bonding. My statement was also only to establish that bond and unity amongst all of us.

It is this love and bond that my seniors taught me which I wanted to share. It is out of this love and bond that Shivanna attended the audio launch event. I really regret that Shivanna had to go through such embarrassment on account of this. But am sure our true love and respect for each other will always remain and get firmer now.

Cinema must remain a bridge between people — never a wall that divides them. This was the intent of my statement and I never have been nor would ever want to give any room for public unrest and animosity.

# పవన్ సినిమా మళ్లీ వాయిదా.. కారణం అదేనా?

పవన్ కల్యాణ్ 'హరిహర వీరమల్లు' మరోసారి వాయిదా పడనుందా? ప్రస్తుతం సోషల్ మీడియా అంతా ఇదే చర్చ నడుస్తోంది. వచ్చే వారం రిలీజ్ పెట్టుకుని ఇలా చేస్తున్నారేంటా అని అభిమానులు మళ్లీ తల పట్టుకుంటున్నారు. ఇంతకీ వాయిదా అని వస్తున్న రూమర్స్ నిజమేనా? వినిపిస్తున్న కారణాలేంటి? సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభంలో అంటే 2019లో అలా పవన్ ఒప్పుకొన్న సినిమా ఇది. 2020 జనవరిలో షూటింగ్ మొదలుపెట్టారు. అప్పటినుంచి ఎప్పటికప్పుడు వాయిదాలు పడుతూ వచ్చిన ఈ చిత్రాన్ని ఎట్టకేలకు గత నెలలో పూర్తి చేశారు. తొలుత క్రిష్ దర్శకుడు కాగా.. కారణాలేంటో తెలీదు గానీ మధ్యలోనే ఇతడు తప్పుకొన్నాడు. దీంతో చిత్ర నిర్మాత ఏఎమ్ రత్నం కొడుకు జ్యోతికృష్ణ.. క్రిష్ స్థానంలోకి వచ్చారు. ఎలాగోలా షూటింగ్ కంప్లీట్ చేశారు. తొలుత ఈ ఏడాది మార్చిలో వస్తుందని అన్నారు. వాయిదా పడింది. మే 30న రావడం పక్కా అన్నారు. అప్పుడు కూడా వాయిదా పడింది. ఎట్టకేలకు జూన్ 12న వస్తుందని పక్కా ఫిక్సయ్యారు. ఇందుకు తగ్గట్లు మరో వారంలో తిరుపతిలో ప్రీ రిలీజ్ ఈవెంట్, ట్రైలర్ లాంచ్ కూడా ఉందని డేట్స్ ప్రకటించారు. ప్రస్తుతం సెన్సార్ ముందుకు ఈ చిత్రం వెళ్లింది. కానీ ఇప్పుడు సడన్‌గా వాయిదా పడిందనే టాక్ వినిపిస్తోంది. జూలైలో 'హరిహర వీరమల్లు' రిలీజ్ ఉండొచ్చని కామెంట్స్ వినిపిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాకు బయ్యర్లు ఇంకా దొరకలేదని, అందుకే వాయిదా వేయనున్నారనే టాక్ వినిపిస్తుంది. మరి ప్రస్తుతం వినిపిస్తున్న రూమర్స్ సంగతేంటి అనేది నిర్మాణ సంస్థ క్లారిటీ ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే సినిమా మీద పెద్దగా హైప్ లేదు. ఇలాంటి టైంలో మరోసారి గనక వాయిదా పడితే మాత్రం ఉన్న కాస్త హైప్ కూడా పోయే అవకాశముంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?



# మాజీ ప్రేమికుల రొమాంటిక్ లవ్ స్టోరీ




మన దగ్గర తక్కువ గానీ బాలీవుడ్‌లో ప్రేమ, బ్రేకప్ అనేవి చాలా ఎక్కువగా వినిపిస్తుంటాయి. కలిసి సినిమా చేయడం లేటు తెగ రూమర్స్ వచ్చేస్తాయి. వాటిలో కొన్ని నిజమవుతుంటాయి. కొన్ని మాత్రం ఆదిలో ఆగిపోతాయి. ఇప్పుడు ఇదంతా ఎందుకు అంటే అప్పట్లో ప్రేమించుకున్నారనే రూమర్స్ వచ్చి, విడిపోయిన ఓ జంట.. చాన్నాళ్ల తర్వాత మళ్లీ కలిశారు. రొమాంటిక్ మూవీ కూడా చేయబోతున్నారు. ఇంతకీ ఈ సినిమా సంగతేంటి? బాలీవుడ్ యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్.. ప్రస్తుతం వరస సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నాడు. గతంలో 'పతీ పత్ని ఔర్ ఓ' మూవీ చేస్తున్న టైంలో హీరోయిన్ అనన్య పాండేతో డేటింగ్ చేస్తున్నాడనే పుకార్లు వచ్చాయి. తర్వాత 'కాఫీ విత్ కరణ్' షోలో ఈ విషయమై మాట్లాడిన కరణ్ జోహార్.. వాళ్లకు బ్రేకప్ అయిందని చెప్పుకొచ్చాడు. కొన్నాళ్ల క్రితం ఇదే కరణ్ జోహార్.. 'దోస్తానా 2' విషయమై కార్తీక్ ఆర్యన్‌తో గొడవపడ్డాడు. ఇకపై తన నిర్మాణ సంస్థలో కార్తీక్‌తో సినిమాలు చేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పాడు.

కట్ చేస్తే ఇప్పుడు అదే కరణ్ జోహార్.. కార్తీక్ ఆర్యన్, అనన్య పాండే జంటగా 'తూ మేరీ మైన్ తేరా, మైన్ తేరా తూ మేరీ' సినిమా చేస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే ఏడాది వాలంటైన్స్ సందర్భంగా ఫిబ్రవరి 13న మూవీ థియేటర్లలోకి వస్తుందని చెప్పారు. దీంతో కార్తీక్‌అనన్యతో పాటు కార్తీక్‌కరణ్ జోహార్ మళ్లీ కలిసిపోయారనే టాక్ వినిపిస్తోంది.



# మై డియర్ శేఖర్.. నీలాంటి అభిమాని ఉండడం ఆనందకరం: చిరంజీవి

మెగాస్టార్ చిరంజీవికి సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల వీరాభిమాని. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని సినిమాల్లోకి వచ్చాడట. ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చిరంజీవిని కలిసి.. ఆయన ఈ విషయాన్ని చెప్పారు. తాజాగా మెగాస్టార్ చిరంజీవి కూడా ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. శేఖర్ కమ్ములపై ప్రశంసలు కురిపించారు. 'మై డియర్ శేఖర్, మీలాంటి ఒక అభిమాని ఉండటం నాకూ అంతే ఆనందకరం. మీ ప్రస్థానానికి స్ఫూర్తి నిచ్చానని తెలిసి మరింత సంతోషించాను. మీ 25 ఏళ్ల జర్నీలో ఆ విధంగా నేనూ ఒక భాగమైనందుకు గర్వంగా ఉంది. సున్నితమైన వినోదంతో పాటు, ఒక సోషల్ కామెంట్ ని జత చేసి ఆలోచనాత్మకంగా తీసే మీ సినిమాలంటే నాకు ఎంతో ఇష్టం. ఫిలిం మేకింగ్‌లో మీ కంటూ ఒక ప్రత్యేక శైలిని క్రియేట్ చేసుకున్న మీరు ఇలాగే మరో 25 ఏళ్ళు, మరెన్నో జనరంజకమైన సినిమాలు 'వ్రాస్తూ', తీస్తూ, మరెన్నో ఉన్నత శిఖరాల్ని అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, ఆశీర్వదిస్తున్నాను' అని చిరంజీవి ట్వీట్ చేశాడు. 'డాలర్ డ్రీమ్స్' సినిమాతో దర్శకుడిగా మారిన శేఖర్ కమ్ములు.. ఆనంద్ మూవీతో సూపర్ హిట్‌ని తన ఖాతాలో వేసుకున్నాడు. గోదావరి, లీడర్, ఫిదా, లవ్ స్టోరీ లాంటి సినిమాలతో టాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు. ఆయన దర్శకత్వం వహించిన తొలి పాన్ ఇండియా మూవీ కుబేర ఈ నెల 20న రిలీజ్ కాబోతుంది. ధనుష్ హీరోగా నటించిన ఈ చిత్రంలో నాగార్జున, రష్మిక కీలక పాత్రలు పోషించారు.



# జయహో బెంగళూరు

మహా పత్రిక
ANN తెలుగు
బుధవారం, హైదరాబాద్ | 04-06-2025
08



## 18 ఏళ్ళ నిరీక్షణకు తెర

- ఐపీఎల్ 2025 ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్
- ఈ సాలా కప్ నమ్దే ..
- విరాట్ కోహ్లీ చిరకాల స్వప్నం సాకారం
- అహ్మదాబాద్‌లో బెంగళూరు అభిమానుల సంబరాలు

### కోహ్లీకి ఆనందం... శ్రేయాస్‌కు నిరాశ!

ఆర్సీబీ తరపున ఆరంభం నుంచి ఆడుతున్న విరాట్ కోహ్లీకి ఈ విజయం ఎంతో ప్రత్యేకం. గతంలో మూడుసార్లు ఫైనల్ చేరినా, టైటిల్ గెలవలేకపోయిన ఆర్సీబీకి, కోహ్లీ నాయకత్వ పటిమ, అద్భుత ఆటతీరు ఈసారి ట్రోఫీని అందించడంలో కీలక పాత్ర పోషించాయి. మరోవైపు, పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు ఇది మూడో ఐపీఎల్ ఫైనల్ అయినప్పటికీ, మరోసారి నిరాశే ఎదురైంది. రెండు జట్లు తమ తొలి టైటిల్ కోసం తీవ్రంగా పోరాడిన ఈ మ్యాచ్, చివరికి ఆర్సీబీకి చిరకాల స్వప్నాన్ని నెరవేర్చింది. ఈ విజయంతో ఆర్సీబీ క్యాంప్‌లో సంబరాలు అంబరాన్నంటాయి.

(మొదటిపేజీ తరువాయి)

ఫిల్ సాల్ట్ (16), విరాట్ కోహ్లీ (35 బంతుల్లో 43 రన్స్), మయాంక్ అగర్వాల్ (18 బంతుల్లో 24 రన్స్), రజత్ పాటీదార్ (16 బంతుల్లో 26 రన్స్), లియామ్ లివింగ్ స్టోన్ (15 బంతుల్లో 25 రన్స్), జితేశ్ శర్మ (10 బంతుల్లో 24 రన్స్), రొమారియో షెఫర్డ్ (9 బంతుల్లో 17 రన్స్) తలా ఓ చేయి వేశారు. అనంతరం పంజాబ్ కింగ్స్‌ను 7 వికెట్లకు 184 పరుగులకు పరుగులకే కట్టడి చేసింది. ఓ దశలో ఈసారి కూడా నిరాశ తప్పదేమో అను కున్న దశ నుంచి టైటిల్‌ను ఒడిసిపట్టింది. సమష్టి ప్రదర్శనతో తొలి ఐపీఎల్ టైటిల్‌ను ముద్దాడింది.

### నాలుగోసారి ఫైనల్ కు చేరి.. తొలిసారి

ఐపీఎల్ 2025కి ముందు ఆర్సీబీ మూడు సార్లు ఫైనల్ చేరింది. 2009, 2011, 2016లో తుది పోరుకు అర్హత సాధించింది. కానీ దక్కన్ ఛార్జర్స్, చెన్నై సూపర్ కింగ్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ చేతిలో పరాజయం పాలై రన్నరప్‌గా నిలిచింది. 9 ఏళ్ల తర్వాత మళ్లీ ఫైనల్ చేరిన ఆర్సీబీ.. ఎట్టకేలకు అనుకున్నది సాధించింది. అటు 11 ఏళ్ల తర్వాత ఐపీఎల్ ఫైనల్‌కు చేరిన పంజాబ్ కింగ్స్‌కు నిరాశే మిగిలింది. టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శన చేసిన ఆ జట్టు.. ఫైనల్‌లో మాత్రం ఓడిపోయింది.

### ఒత్తిడికి గురైన పంజాబ్ బ్యాటర్లు


ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 టోర్నమెంట్ నేపథ్యంలో... ఫైనల్ మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారని చెప్పవచ్చు. గత మ్యాచ్లలో... ఫాస్ట్ గా ఆడిన పంజాబ్ కింగ్స్ ఆటగాళ్లు... ఫైనల్ మ్యాచ్ అనేసరికి కాస్త ఒత్తిడిలోకి వెళ్లిపోయారు. ప్రియాంష్ ఆర్య 24 పరుగులు చేయగా, ప్రభసిమ్రాన్ సింగ్ 22 బంతులు ఆడి కేవలం 26 పరుగులు మాత్రమే చేశాడు. అటు సర్పంచ్ సాబ్ శ్రేయస్ అయ్యర్ ఒకే ఒక్క పరుగు చేసి దారుణంగా విఫలమయ్యాడు. అటు ఇంగ్లాండ్ ఆటగాడు జోష్ ఇంగ్లిష్ మరోసారి రాణించే ప్రయత్నం చేయగా... అతనికి



మంచి సపోర్ట్ దొరకలేదు. శశాంక్ సింగ్ ఒంటరి పోరాటం మాత్రం అందరిని ఆకట్టుకుంది.

### అదరగొట్టిన బెంగళూరు

ఫైనల్ మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆటగాళ్లు పెద్ద ఇన్నింగ్స్ లో ఆడకపోయినా... చివరి వరకు ఆడి 190 పరుగులు అయితే చేయగలిగారు. పంజాబ్ బౌలర్లు చాలా కఠినంగా బౌలింగ్ వేసినప్పటికీ... నిర్ణీత 20 ఓవర్స్ లో... తొమ్మిది వికెట్లు నష్టపోయి 170 పరుగులు చేసింది రాయల్ చాలెంజెస్ బెంగళూరు. ఇందులో విరాట్ కోహ్లీ 35 బంతుల్లో 43 పరుగులు చేశాడు. 122 స్ట్రైక్ రేటుతో మూడు బౌండరీలు సాధించాడు. అలాగే మయాంక్ అగర్వాల్ 24 పరుగులు చేయగా... పిల్ సాల్ట్ 16 పరుగులకు అవుట్ అయ్యాడు. రజత్ పటిదార్ 26 పరుగులు చేశాడు. లివింగ్ స్టోన్ 25 పరుగులు చేయగా జితేష్ శర్మ 24 పరుగులు చేసి రాణించాడు.



## ప్రైజ్ మనీ వివరాలు..

**విజేత, రన్నరప్‌లకు:** ఐపీఎల్ ప్రైజ్ మనీలో మూడేళ్ల నుంచి బీసీసీఐ ఎలాంటి మార్పు చేయలేదు. ప్రైజ్ మనీలో మార్పులు చివరిసారి 2022లో జరిగాయి. ఐపీఎల్‌లో విజేతగా నిలిచిన జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అందించిన నగదు బహుమతి అక్షరాల రూ.20 కోట్లు. ఇక పోరాడి ఓడిన రన్నరప్ పంజాబ్ కింగ్స్ జట్టుకు రూ.13.5 కోట్లు బహుమతిగా లభించాయి.

**క్వాలిఫయర్, ఎలిమినేటర్‌కు:** క్వాలిఫయర్-2 నుంచి ఎలిమినేట్ అయిన ముంబై ఇండియన్స్ జట్టుకు రూ.7 కోట్ల నగదు ప్రోత్సాహకం దక్కుతుంది. ఎలిమినేటర్‌లో ఓడిన గుజరాత్ టైటాన్స్ జట్టుకు రూ.6.5 కోట్ల నగదు బహుమతి అందిస్తారు. ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్, సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్, ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ వంటి అవార్డులకు ఐపీఎల్‌లో నగదు బహుమతి అందించారు.

**ఆరెంజ్ క్యాప్:** సాయి సుదర్శన్‌కు రూ.10 లక్షలు పొందాడు. 759పరుగులతో ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా గుజరాత్ టైటాన్స్‌కు చెందిన సాయి సుదర్శన్ నిలిచాడు.

**పర్పుల్ క్యాప్:** ప్రసిద్ధ్ కృష్ణ రూ.10 లక్షలు అందుకున్నాడు. 25 వికెట్లు తీసి ఈ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా గుజరాత్ టైటాన్స్‌కు చెందిన ప్రసిద్ధ్ కృష్ణ నిలిచాడు.

**ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్:** సాయి సుదర్శన్‌రూ.20 లక్షలు అందుకున్నాడు.

**సీజన్‌లో అత్యంత విలువైన ఆటగాడు:** సూర్య కుమార్ యాదవ్ రూ.10 లక్షలు గెలుచుకున్నాడు. ముంబై ఇండియన్స్ లో కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

**సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్:** రూ.10 లక్షలు

**పవర్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్/ సిరీస్:** సాయి సుదర్శన్‌కు రూ.10 లక్షలు అందించారు.

ఒక సీజన్‌లో అత్యధిక సిక్సర్లు రూ.10 లక్షలు గేమ్ ఛేంజర్ ఆఫ్ ది సీజన్ రూ.10 లక్షలు

**ఫెయిర్ ప్లే అవార్డు:** విజేతగా చెన్నై సూపర్ కింగ్స్ నిలిచింది. కానీ ఈ సీజన్‌లో అత్యధిక ఓటములతో అట్టడుగున చెన్నై నిలవడం కలచివేసే అంశం.

**క్యాచ్ ఆఫ్ ది సీజన్:** ఈ అవార్డును కమిందు మెండిస్ సొంతం చేసుకున్నాడు.

**సూపర్ స్ట్రైకర్:** యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అవార్డు అందుకున్నాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com